మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 9-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 310 Issue: 310

Circulated to Telangana
Published from Jagitial

09 మే 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:50 సూర్యాస్తమయం - సా. 6:35 తిథి సప్తమి మ. 1:59 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం శ్రవణ రా. 11:13 వరకు తరువాత ధనిష్ఠ యోగం శుక్ల రా. 2:25ం వరకు కరణం బవ మ. 1:59 వరకు భాలవ రా. 2:38ం వరకు వర్జ్యం తె. 3:38 నుండి తె. 5:20 వరకు దుర్ముహూర్తం ఉ. 7:32 నుండి ఉ. 8:23 వరకు రాహుకాలం ఉ. 9:01 నుండి ఉ. 10:37 వరకు యమగండం మ. 1:48 నుండి మ. 3:23 వరకు గుళికాకాలం తె. 5:50 నుండి ఉ. 7:25 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:14 నుండి తె. 5:02 వరకు అమృత ఘడియలు మ. 12:23 నుండి మ. 2:08 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:38 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## వీర్యాధివీరుడు!

### చచ్చుబడ్డ శుక్రకణం పునరుత్పత్తి

**చిన్ననాటి వృషణ కణజాలంతో తిరిగి సంతాన సామర్థ్యం**

**వైద్య రంగంలో సరికొత్త చరిత్ర**

వైద్య శాస్త్ర రంగంలో అద్భుత పరిశోధన ఆవిష్కృతమైంది. చిన్నతనంలో కీమోథెరపీ/రేడియేషన్ వంటి చికిత్సల వల్ల భవిష్యత్తులో సంతాన సామర్థ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉన్న ఒక వ్యక్తికి, శాస్త్రవేత్తలు తిరిగి ఆ సామర్థ్యాన్ని కలిగించి సరికొత్త రికార్డు సృష్టించారు.

బ్రస్సెల్స్: బెల్జియానికి చెందిన ఒక వ్యక్తి చిన్నతనంలో 'సికిల్ సెల్ అనీమియా' రక్త సంబంధిత వ్యాధితో బాధపడ్డాడు. ఆ సమయంలో అతనికి కీమోథెరపీ అవసరమైంది. ఈ చికిత్స వల్ల భవిష్యత్తులో శుక్రకణాల ఉత్పత్తి దెబ్బతినే అవకాశం ఉందని గ్రహించి, 2008లో (అతనికి సుమారు 10 ఏళ్ల వయసు ఉన్నప్పుడు) అతని వృషణ కణజాలాన్ని సేకరించి భద్రపరిచారు. దాదాపు 14 ఏళ్ల తర్వాత, ఆ వ్యక్తికి తన సంతాన సామర్థ్యం గురించి పరీక్షలు నిర్వహించగా, సజీవ శుక్రకణాలు లేవని తేలింది. దీంతో, బ్రస్సెల్స్ యూనివర్సిటీ తరువాయి 2 వ పేజీలో...

## 118 ఫిగర్.. ఫికర్!

### గవర్నర్ నుంచి రాని గ్రీన్ సిగ్నల్

**విజయ్‌కు ఇంకా దక్కని మెజారిటీ**

**చివర్లో వీసీకే దాగుడుమూతలు**

**టీవీకే అధినేత ప్రమాణంపై సందిగ్ధత**



చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో మరోసారి ఉత్కంఠ పరిణామం చోటు చేసుకుంది. శనివారం జరగాల్సిన విజయ్ ప్రమాణ స్వీకారంపై గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన కార్యాలయం లోక్‌భవన్ ప్రకారం, విజయ్‌కు ప్రస్తుతం 116 మంది ఎమ్మెల్యేల మద్దతు మాత్రమే ఉందని, మెజారిటీకి కావాల్సిన 118 సంఖ్య ఇంకా చేరలేదని స్పష్టం చేశారు. వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు లేఖలు ఇంకా తరువాయి 2 వ పేజీలో...

## మేమూ రేస్‌లో..!

**అన్నాడీఎంకేను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించండి**

**ఏఎంఎంకే నేత టీటీవీ దినకరన్ లేఖ**



AMMA MAKKAL MUNNETTRA KAZAGAM
HEAD OFFICE
No: 21/11, 1st Main Road, Karpagam Garden, Adyar, Chennai - 600 020
Phone: 044 - 2848 1236

TTV DHINAKARAN
GENERAL SECRETARY

Dated 8th May, 2026

To

The Hon'ble Governor,
State of Tamil Nadu,
Lok Bhavan,
Chennai.

**Subject: Letter of Support to AIADMK to form the new Government with Thiru Edappadi K.Palaniswami as the Chief Minister.**

**Hon'ble Sir,**

I, TTV Dhinakaran, General Secretary of Amma Makkal Munnettra Kazagam hereby extend my full support to the claim of Thiru. Edappadi K.Palaniswami to form the new Government of the State of Tamil Nadu.

Our Party Candidate Mr.Kamaraj.S who contested in Mannargudi Constituency (167) have been elected as MLA of the Constituency.

Mr.Kamaraj.S MLA of Mannargudi Constituency (167) have also signed

చెన్నై: తమిళనాడు రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయి. టీవీకే నేతృత్వంలో విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ నుంచి ఇంకా అధికారికంగా అనుమతి రాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో అరవ రాజకీయం మరో కీలక మలుపు తీసుకుంది. తమిళనాడులో అన్నాడీఎంకే నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌ను కోరారు. ఈ మేరకు గవర్నర్‌కు లేఖ సమర్పించారు. ఎడప్పాడి పళనిస్వామి ముఖ్యమంత్రిగా కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మద్దతు తెలియజేస్తూ టీటీవీ దినకరన్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌కు తరువాయి 2 వ పేజీలో...



## విజయ్ కేజ్రీ స్ట్రాటజీ!

**2013 ఆప్ పరిస్థితే నేడు టీవీకేకు.. ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే మళ్లీ ఎన్నికలు**

**ఈ సారి బంపర్ మెజార్టీ ఖాయం.. సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే చాన్స్**

తమిళనాడు రాజకీయాలు ఉత్కంఠభరితమైన మలుపులో ఉన్నాయి. ఏ ఒక్క పార్టీకి స్పష్టమైన మెజారిటీని ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో, టీవీకే అధినేత విజయ్.. 2013 నాటి అరవింద్ కేజ్రీవాల్ రాజకీయ వ్యూహం అమలు చేయాలని చూస్తున్నట్లు అవగతం అవుతోంది. 2013లో ఢిల్లీలో ఆప్ 28 సీట్లు గెలిచి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీకి దూరంగా నిలిచింది. నేడు తమిళనాడులో విజయ్ పరిస్థితి కూడా అచ్చం అలాగే ఉంది.

(ఈవార్తలు పొలిటికల్ డెస్క్)

విజయ్ పార్టీ 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 118 సీట్లు (మ్యాజిక్ ఫిగర్) అవసరం. కాంగ్రెస్ (5 సీట్లు) మద్దతు ఇచ్చినప్పటికీ, విజయ్ ఇంకా మ్యాజిక్ ఫిగర్ చేరుకోలేకపోయారు. మరోవైపు డీఎంకే, అన్నాడీఎంకేలు పొత్తు పెట్టుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సూచనలు కనిపిస్తుండటంతో, విజయ్ సాహసోపేతమైన నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారు. తనకు స్పష్టమైన మెజారిటీ రాకుండా, ఇతర తరువాయి 2 వ పేజీలో...



**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,300 |
| వెండి (కిలో): | రూ.2,75,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,291 |

## మూసీ.. ముహూర్తం రెడీ!

### సుందరీకరణకు ప్రభుత్వం ఏర్పాట్లు

**ఆగస్ట్ నుంచి పనులు ప్రారంభం**

**తొలిదశలో 7,055 కోట్లతో పనులు**

మూసీ నది సుందరీకరణ దిశగా అడుగులు పడుతున్నాయి. మూసీ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టు నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం సమావేశమై వివిధ అంశాలపై చర్చించింది.

హైదరాబాద్, మే 8 (ఈవార్తలు): ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ పరిశీలించింది. ఈ నేపథ్యంలోనే తొలిదశలో రూ.7,055 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. తొలి దశ పనులకు సం బంధించి ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకుతో చర్చలు ముగిసినట్లు అధికారులు మంత్రులకు తెలియజేశారు. మరోవైపు ప్రాజెక్టు తొలి దశలో నిర్మాణాలపై ప్రభావం లేని ఐదు కిలోమీటర్ల మేరకు పనులు ప్రారంభించాలని కేబినెట్ సబ్ కమిటీ తరువాయి 2 వ పేజీలో...





## బెంగాల్ సీఎంగా సువేందు అధికారి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ కొత్త ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ఎంపికయ్యారు. బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమక్షంలో ఎమ్మెల్యేలు ఆయనను ఏకగ్రీవంగా సీఎంగా ఎన్నుకున్నారు. దీంతో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం శనివారం అధికారంలోకి రానుంది. ఉదయం 11 గంటలకు సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇవాళ కోల్‌కతాలో పర్యటించి, బీజేపీకి చెందిన కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



తన భార్యను ఎవరు హత్య చేశారో తెలియకపోవడంతో, హత్య చేసిన అపార్టుమెంట్‌లో నిందితుల ఆనవాళ్లు చెరిగిపోవద్దన్న ఉద్దేశంతో 26 ఏళ్లుగా ఆ ఇంటికి అద్దె కట్టాడో వ్యక్తి. అతడి పేరు సటోరు టకాబా. క్రైం సీన్‌ను అలాగే భద్రంగా ఉంచాలని ఆ నిర్ణయం తీసుకున్నాడు. ఎట్టకేలకు టెక్నాలజీ అభివృద్ధి చెంది, నిందితురాలిని పోలీసులు గుర్తించగలిగారు. ఆమె సటోరు స్కూల్ స్నేహితురాలేనని తేల్చారు. అయితే, సటోరు భార్య హత్యకు గల కారణాలను మాత్రం పోలీసులు ఇంకా గుర్తించలేదు.

## తెలంగాణకు కాంగ్రెస్ దరిద్రం

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



దేశమంతా కాంగ్రెస్ దరిద్రాన్ని వదిలించుకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ దరిద్రాన్ని నెత్తిపై రుద్దుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, విద్యార్థులు ఆగమవుతున్నారని అన్నారు. రెండున్నరేళ్లలో నోటిఫికేషన్లు లేవని తెలిపారు. మేమేం తప్పు చేశామని అరెస్టు చేస్తారని కేటీఆర్ ప్రశ్నించారు.

హైదరాబాద్, మే 8 (ఈవార్తలు): రేవంత్‌కు కంటిలో నలుసులా తయారయ్యామని అరెస్టు చేస్తారా అని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలేవి? రైతు డిక్లరేషన్ సంగతి ఏమైందని నిలదీశారు. బీఆర్ఎస్ ఆందోళనతో కాంగ్రెస్ ఆగమైతుందని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం బావుసింగ్ భూక్య తండాలో శుక్రవారం జరిగిన జగదాంబ మాత సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠ తరువాయి 2 వ పేజీలో...

## కేరళ సీఎం రేసులో కేసీ



కేరళ ముఖ్యమంత్రి రేసులో కేసీ వేణుగోపాల్ ముందంజలో ఉన్నారు. పార్టీ పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్‌లు తమ రిపోర్టును పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు సమర్పించిన దరిమిలా ఈ విషయం వెల్లడయ్యింది.

తిరువనంతపురం: అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్ మాట్లాడుతూ సీఎం ఎంపిక అనేది నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, కూటమిలోని నేతలు, ప్రజాభిప్రాయం మొదలైన వాటిపై ఆధారపడి ఉంటుందన్నారు. పార్టీ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం అతి త్వరలోనే కాంగ్రెస్ అధిష్టానం సీఎం పేరును వెల్లడించనుంది. కాగా వేణుగోపాల్ కేరళ సీఎం రేసులో ముందున్నారు. ఈ జాబితాలో అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్, మరో సీనియర్ నేత రమేశ్ తరువాయి 2 వ పేజీలో...




## 'ఇండియా'కు డీఎంకే గుడ్‌బై

చెన్నై: తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటులో ఉత్కంఠ కొనసాగుతున్న సమయంలో, డీఎంకే ఇండియా కూటమికి గుడ్‌బై చెప్పింది. కాంగ్రెస్‌తో పొత్తు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ పరిణామం దేశ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీస్తోంది. డీఎంకే ఎంపీ కనిమొళి లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాసి, డీఎంకే ఎంపీలకు తరువాయి 2 వ పేజీలో...

### 30,000 కోట్లు లాస్!

**ఆయిల్ కంపెనీలకు భారీ నష్టం**

**వెల్లడించిన అధికార వర్గాలు**

2



## రాశి ఫలాలు

9.5.2026

మేషం: సంతానం విద్యా విషయాలలో శుభవార్తలు అందుతాయి. సోదరులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దైవ అనుగ్రహంతో వ్యాపారాలు లాభాల బాట పడతాయి. ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు.

వృషభం: వాహన ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులలో అధిక శ్రమతో అల్ప ఫలితాన్ని పొందుతారు. దాయాదులతో ఆస్తి వివాదాలు కలుగుతాయి. చిన్ననాటి మిత్రులతో మాట పట్టింపులు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగ ప్రయత్నములు అంతగా అనుకూలించవు.

మిధునం: ముఖ్యమైన వ్యవహారాల్లో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. ఇంటాబయట ఊహించని చికాకులు పెరుగుతాయి. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. జీవిత భాగస్వామి ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. వృత్తి వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు తప్పవు.

కర్కాటకం: ప్రయాణాలలో కొత్త వ్యక్తుల పరిచయాలు భవిష్యత్తుకు ఉపయోగపడతాయి. బంధు మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు. వృత్తి వ్యాపారాలు అనుకూలంగా సాగుతాయి. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తినిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు ఫలించి నూతన అవకాశాలు లభిస్తాయి.

సింహం: సమాజంలో పెద్దల నుండి ప్రశంసలు పొందుతారు. సంతానానికి నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. మంచి మాట తీరుతో ఇంటాబయట అందరినీ ఆకట్టుకుంటారు. వృత్తి వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

కన్య: దీర్ఘకాలిక ఋణ ఒత్తిడి అధికమవుతుంది. దూరప్రయాణాలు ఆకస్మికంగా వాయిదా వేస్తారు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటారు. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగాలలో అదనపు పనిభారం ఉంటుంది.

తుల: బంధు మిత్రులతో ఊహించిన మాటపట్టింపులు కలుగుతాయి. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణప్రయత్నాలు చేస్తారు. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు తప్పవు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు, ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

వృశ్చికం: నిరుద్యోగులకు నూతన ఉద్యోగ యోగం ఉన్నది. ప్రణాళికలతో అనుకున్న పనులను పూర్తిచేస్తారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. వ్యాపారాలలో ఉత్సాహంతో ముందుకు సాగుతారు. ఒక వ్యవహారంలో దూరప్రాంత బంధుమిత్రుల నుంచి కీలక సమాచారం సేకరిస్తారు. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

ధనస్సు: వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. బంధువులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కొన్ని వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. దైవదర్శనాలు చేసుకుంటారు. ఉద్యోగాలలో అధికారులతో చర్చలు అంతగా అనుకూలించవు.

మకరం: ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది. సంతానం పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. కుటుంబ సభ్యుల నుండి శుభవార్తలు అందుతాయి. ముఖ్యమైన పనులు అప్రయత్నంగా పూర్తి చేస్తారు. వ్యాపారాలలో అంచనాలు అందుకుంటారు. ఉద్యోగులకు అనుకూలమైన కాలం.

కుంభం: ఇంటాబయట చికాకులు పెరుగుతాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. ముఖ్యమైన పనులు వాయిదా వేయుట మంచిది. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. వృత్తి ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు మందగిస్తాయి.

మీనం: సన్నిహితుల నుంచి అవసరానికి ధనసహాయం అందుతుంది. ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలకు నూతన పెట్టుబడులు అందుతాయి. దీర్ఘకాలిక ఋణాలు తీర్చగలుగుతారు. ఆర్థిక వ్యవహారాలు గతం కంటే మెరుగ్గా ఉంటాయి. ఉద్యోగమున అధికారుల అనుగ్రహంతో హోదాలు పెరుగుతాయి.

# విజయ్ కేజ్రీ స్ట్రాటజీ!

మొదటి పేజీ తరువాయి

పార్టీల పొత్తులతో ఏర్పడే ప్రభుత్వం ప్రజల ఆశయాలకు విరుద్ధమని విజయ్ భావిస్తున్నారు. అందుకే, తన పార్టీకి చెందిన 107 మంది ఎమ్మెల్యేలతో (విజయ్ సహా) మూకుమ్మడిగా రాజీనామా చేయించి, అసెంబ్లీని రద్దు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని యోచిస్తున్నారు. దీని ద్వారా ప్రజల్లోకి వెళ్లి, నాకు పూర్తి అధికారం ఇవ్వండి, సుస్థిర పాలన అందిస్తాను అని అడగాలన్నది ఆయన వ్యూహం. అరవింద్ కేజ్రీవాల్ కూడా సరిగ్గా ఇదే చేశారు. 2013లో కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా, జన్ లోక్‌పాల్ బిల్లు విషయంలో ఇతర పార్టీలు సహకరించకపోవడంతో 49 రోజులకే రాజీనామా చేశారు. ఫిబ్రవరి 14, 2014న కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేశారు. కేజ్రీవాల్ రాజీనామాను అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆమోదించడంతో ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించారు. ఆ తర్వాత, ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే ప్రభుత్వం వద్దు, పూర్తి మెజారిటీ ఇవ్వండి అని ప్రజలను కోరారు. ఫలితం 2015 ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు ఆప్‌కు 70కి గాను 67 సీట్లు ఇచ్చి బ్రహ్మరథం పట్టారు. రాజకీయ విశ్లేషకుల ప్రకారం, విజయ్ ఈ రిస్క్ తీసుకుంటే, ఫలితాలు ఆయనకు అనుకూలంగా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అతిపెద్ద పార్టీగా గెలిచినా అధికారం దక్కకుండా చేశారన్న సానుభూతి విజయ్‌కు కలిసి వస్తుంది. డీఎంకే, అన్నాడీఎంకేలు ఒక్కటైతే, ఆ రెండు పార్టీలూ కేవలం అధికారం కోసమే పాకులాడుతున్నాయన్న భావన ప్రజల్లో బలపడుతుంది. ఇది విజయ్‌ను ఒంటరి పోరాట వీరుడిగా నిలబెడుతుంది. హంగ్ అసెంబ్లీ వల్ల కలిగే అనిశ్చితిని చూసిన ఓటర్లు, ఈసారి విజయ్‌కు ఏకపక్ష మెజారిటీ ఇచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. చరిత్ర పునరావృతమవుతుంది అన్నట్లుగా, కేజ్రీవాల్ 2014లో వేసిన అడుగు, నేడు విజయ్‌కు మార్గదర్శకంగా మారింది. ఒకవేళ విజయ్ తన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి మళ్లీ ఎన్నికలకు వెళితే, తమిళనాడు రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోవడం ఖాయం. అది మరో ఢిల్లీ 2015 తరహా సునామీ విజయం అవుతుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# 118 ఫిగర్.. ఫికర్!



మొదటి పేజీ తరువాయి

అందలేదని గవర్నర్ కార్యాలయం పేర్కొంది. అయితే, విజయ్ శుక్రవారం మూడోసారి గవర్నర్‌ను కలిసి టీవీకే, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, వీసీకే పార్టీల మద్దతుతో మొత్తం 118 మంది ఎమ్మెల్యేల మద్దతు తనకు ఉందని తెలిపారు. సంబంధిత లేఖలను గవర్నర్‌కు అందజేశారు. గవర్నర్ కూడా కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. అనంతరం విజయ్ తనకు మద్దతు తెలిపిన వామపక్ష నేతలతో సమావేశమై కృతజ్ఞతలు తెలిపారు. సీపీఐ, సీపీఎం ఇప్పటికే బేషరతుగా మద్దతు ప్రకటించాయి. ఈ రెండు పార్టీలకు నాలుగు సీట్లు ఉన్నాయి. ఐయూఎంఎల్ రెండు సీట్లు గెలుచుకున్నప్పటికీ, వారు నేరుగా విజయ్‌కు మద్దతు ప్రకటించకపోయినా ప్రభుత్వం ఏర్పాటు చేసే ఏ పార్టీకైనా మద్దతు ఇస్తామని తెలిపారు. కాంగ్రెస్ ఐదు సీట్లతో ఇప్పటికే విజయ్‌కు మద్దతు ప్రకటించింది. విజయ్ పార్టీ టీవీకే 108 సీట్లు గెలుచుకున్నప్పటికీ, ఆయన రెండు చోట్ల నుంచి గెలవడంతో అసలు సంఖ్య 107కి తగ్గింది. దీంతో మెజారిటీ మార్క్ 118కి 11 సీట్లు దూరంలో నిలిచింది. ఈ నేపథ్యంలో వామపక్షాలు, కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు కీలకంగా మారింది. రెండు సీట్లు గెలిచిన వీసీకే పార్టీ.. డిప్యూటీ సీఎం పదవి కావాలని పట్టుబడుతోంది. అయితే, ఇప్పటికే వీసీకే పార్టీకి తాము పట్టణాభివృద్ధి శాఖ, తిరుచ్చి అసెంబ్లీ నియోజవకర్గం సీటు ఇస్తామని హామీ ఇచ్చింది. రేపు విజయ్ ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉండగా.. ఊహించని విధంగా తమకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తేనే మద్దతు పలుకుతామని, లేదంటే విరమించుకుంటామని పట్టుబట్టింది. అందకే గవర్నర్‌కు లేఖ అందించలేదు. అదే సమయంలో డీఎంకే అధినేత స్టాలిన్‌తో విడుతలై చిరుతైగల్ కట్చి పార్టీ అధినేత, ప్రముఖ దళిత నాయకుడు తోల్. తిరుమాళవన్ భేటీ అయ్యారు.

# మూసీ.. ముహూర్తం రెడీ!

మొదటి పేజీ తరువాయి

అధికారులను ఆదేశించింది. నిర్మాణాలపై తక్కువగా ప్రభావం పడేలా అలైన్‌మెంట్ మార్చాలని కేబినెట్ సబ్ కమిటీ సూచించింది. మరోవైపు ఆగస్టు నెల నుంచి పనులను ప్రారంభించి.. 2027 డిసెంబర్ నాటికల్లా పూర్తిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు ప్రజా భాగస్వామ్యంతోనే అమలు చేస్తామని మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, వారి ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రాజెక్టును రూపొందించాలని అధికారులకు స్పష్టం చేసింది. ఇందుకోసం ప్రాజెక్టు అలైన్‌మెంట్‌లో మార్పులు చేసి నిర్మాణాలపై ప్రభావం తగ్గించేలా చూడాలని అధికారులకు స్పష్టం చేసింది. మరోవైపు మొత్తం 55 కిలోమీటర్ల మేరకు మూసీ ప్రాజెక్టును చేపడుతున్నారు. 5 దశల్లో ఈ ప్రాజెక్టు పనులు జరగనున్నాయి. తొలి దశలో హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌ల నుంచి బాపుఘాట్ వరకూ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రాజెక్టులో భాగంగా మూసీ నదిలోని చెత్తను తొలగిస్తారు. రివర్ బెడ్ ప్రొఫైలింగ్ చేపడతారు. రిటైనింగ్ వాల్స్, రెండు వైపులా రహదారులు, మురుగు కాలువలు, బ్యారేజీలు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి వంటి పనులు చేపడతారు.డిసెంబర్ 2027 నాటికల్లా ప్రాజెక్టును పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతోంది.



# 30,000 కోట్ల లాస్!

## ఆయిల్ కంపెనీలకు భారీ నష్టం.. వెల్లడించిన అధికార వర్గాలు

న్యూఢిల్లీ: పశ్చిమాసియా ఘర్షణలతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భగ్గుమంటున్నాయి. ఫిబ్రవరి 28న ఇరాన్ యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ఒక బ్యారెల్ ముడి చమురు ధర 70 డాలర్ల వద్ద ఉండగా.. ప్రస్తుతం 100 డాలర్లపైనే నడుస్తోంది. ఒక దశలో 144 డాలర్లకు కూడా చేరుకుంది. అయినా సరే దేశంలో చమురు ధరలు స్థిరంగానే ఉన్నాయి. దీంతో ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలకు రూ.30వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారిక వర్గాల వెల్లడించాయి. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభం అయిన దగ్గరినుంచి ముడిసరకు ధర ఒక దశలో 50శాతం వరకు పెరిగినా.. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఇంధన సరఫరాను నిరంతరాయంగా కొనసాగించాయి. హర్మూజ్ అంతరాయాల వేళ ప్రజలు భయంతో కొనుగోళ్లు చేపట్టడంతో గిరాకీ భారీగా పెరిగి, సరఫరా వ్యవస్థలు ఒత్తిడికి గురైన సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో కూడా ధరలు పెంచకపోవడంతో మార్చి మధ్య నుంచి ఈ మూడు కంపెనీలు రూ.30వేల కోట్ల నష్టం చవిచూశాయి. వాస్తవంగా ఆ నష్టం రూ.62,500 కోట్లవరకు చేరేది. కానీ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. దానివల్లే నష్టాలు తగ్గాయని ఆ వర్గాలు వెల్లడించాయి. అంతర్జాతీయంగా పెరిగిన ముడి చమురు ధరకు అదనంగా మరికొన్ని ఖర్చులను భరించాల్సి వచ్చింది. రవాణా నౌకలను దారి మళ్లించడం, బీమా ప్రీమియాలు పెరగడం వంటి ఖర్చులు తోడయ్యాయి. ఈ చమురు షాక్ సమయంలో వినియోగదారులపై భారం పడకూడదని, ఆర్థికపరమైన నిర్ణయాల్లో స్థిరత్వాన్ని కొనసాగించాలన్న నిర్ణయం కంపెనీల బ్యాలెన్స్ షీట్లపై ఒత్తిడి పెంచిందని తెలుస్తోంది. అయితే ఈ నష్టాలను ఇలాగే కొనసాగిస్తే.. కంపెనీలు భారీగా మూలధన రుణాలపై ఆధారపడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే సంక్షోభ సమయంలో పలు దేశాల్లో ధరలు పెంచగా.. భారత్ భిన్నమైన వైఖరిని అవలంబించిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.



# తెలంగాణకు కాంగ్రెస్ దరిద్రం

మొదటి పేజీ తరువాయి

వేడుకల్లో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో మాదిరిగా వీర్నపల్లిలో కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేస్తామని కేటీఆర్ తెలిపారు. మన ప్రభుత్వం లేకున్నా గ్రామాలను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మనకు మళ్లీ మంచిరోజులు తిరిగి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది.. రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్‌ది దండుపాళ్యం ముఠా అని విమర్శించారు. మేడారం అభివృద్ధి పనుల్లో వాటాల కోసం మంత్రులు కొట్లాడుకున్నారని గుర్తుచేశారు. ఏ ఊరికి వెళ్లినా మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఒక్క ఓటు తప్పునకు ఐదేళ్ల శిక్ష తప్పదని.. ఓపిక పట్టాలని సూచించారు. ఇవాళ ఏవారం.. రేపు ఏవారం తప్ప బీజేపీ వాళ్లకు ఏమీ తెలియదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. బండి సంజయ్ కాదు.. తొండి సంజయ్ అని విమర్శించారు. బండి సంజయ్ ఎక్కడైనా ఒక బడి, ఒక గుడి కట్టించారా అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో యాదాద్రిని అద్భుతంగా నిర్మించామని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో భూముల విలువ పడిపోయిందని అన్నారు.

# వీర్యాధివీరుడు!

మొదటి పేజీ తరువాయి

హాస్పిటల్ వైద్యులు 2025లో ఒక ప్రయోగాత్మక శస్త్రచికిత్సను నిర్వహించారు. చిన్నతనంలో భద్రపరిచిన కణజాలాన్ని తిరిగి అతని శరీరంలోకి చేర్చారు. ఈ శస్త్రచికిత్స జరిగిన ఏడాది తర్వాత, అమర్చిన కణజాలం నుంచి సజీవమైన, కదిలే శుక్రకణాలు ఉత్పత్తి అవుతున్నట్లు గుర్తించారు. అపరిపక్వ స్థితిలో భద్రపరిచిన కణజాలం నుంచి పెద్దయ్యాక తిరిగి శుక్రకణాలు ఉత్పత్తి కావడం ఇదే తొలిసారి. అయితే, ఈ శుక్రకణాలు నేరుగా వీర్యంలోకి రావడం లేదు. ఆ వ్యక్తి తండ్రి కావాలంటే ఐవీఎఫ్ పద్ధతి ద్వారా ఈ శుక్రకణాలను సేకరించి ఉపయోగించాల్సి ఉంటుంది. తాజా విజయం ప్రపంచవ్యాప్తంగా కీమోథెరపీ పొందుతున్న వేల మంది బాలురకు తమ సంతాన సామర్థ్యాన్ని కాపాడుకోవడానికి ఒక మార్గాన్ని చూపుతోంది. ప్రస్తుతం క్లినికల్ ట్రయల్స్ దశలో ఉన్న ఈ చికిత్సపై దీర్ఘకాలిక ఫలితాలు, పుట్టబోయే పిల్లల ఆరోగ్యంపై శాస్త్రవేత్తలు పూర్తి స్థాయి పరిశోధనలు చేయాల్సి ఉంది.

# బెంగాల్ సీఎంగా సువేందు అధికారి

మొదటి పేజీ తరువాయి

సమావేశమయ్యారు. పశ్చిమ బెంగాల్ న్యూటౌన్‌లోని బిస్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ వర్గాల ప్రకారం, సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనుండగా, ఇద్దరు మహిళలకు డిప్యూటీ సీఎం పదవులు కేటాయించే నిర్ణయం తీసుకున్నారు. బెంగాల్‌లో బీజేపీకి చెందిన తొలి ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన నందిగ్రామ్, భవానిపూర్ రెండు నియోజకవర్గాల నుంచి గెలుపొందారు. భవానిపూర్‌లో 15 వేల ఓట్ల మెజార్టీతో మమతా బెనర్జీని ఓడించారు. సువేందు అధికారి పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో 'జెయింట్ కిల్లర్'గా పేరుపొందిన నేత. ఆయన కాంగ్రెస్ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి తృణమూల్ కాంగ్రెస్ ద్వారా ఎదిగి, చివరికి బీజేపీలో చేరి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

# మేమూ రేస్‌లో..!

మొదటి పేజీ తరువాయి

ఒక లేఖను సమర్పించారు. మరోవైపు ఏఎంఎంకే అన్నాడీఎంకే కూటమిలో భాగంగా ఉంది. తాము విజయ్ టీవీకే పార్టీకి మద్దతు ఇవ్వడం లేదన్న టీటీవీ దినకరన్.. అన్నాడీఎంకేకే తమ మద్దతు ఉంటుందన్నారు. మన్నార్‌గుడి నియోజకవర్గం నుంచి తమ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కామరాజ్ ఎమ్మెల్యేగా గెలుపొందారన్న టీటీవీ దినకరన్.. పళనిస్వామి నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతుగా కామరాజ్ కూడా ఈ లేఖపై సంతకం చేసినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటుకు పళనిస్వామిని ఆహ్వానించాలని.. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి అనుమతి ఇవ్వాలని గవర్నర్‌ను కోరారు. మరోవైపు శుక్రవారం రోజున మూడోసారి గవర్నర్‌ను కలిసిన విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని మరోసారి కోరారు. అలాగే విజయ్ టీవీకే పార్టీకి కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీలతో పాటుగా వీసీకే పార్టీ మద్దతు ప్రకటించటంతో.. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మ్యాజిక్ నంబర్ విజయ్ సాధించినట్లైంది. దీంతో టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్తలు వచ్చాయి. అలాగే శనివారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం ఉంటుందని సీపీఎం నేత బాలకృష్ణన్ కూడా ప్రకటించారు. అయితే లోక్‌భవన్ నుంచి మాత్రం అధికారిక ప్రకటన రాలేదు. ఈలోపు అన్నాడీఎంకే నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్‌కు లేఖ అందడంతో తమిళ రాజకీయాల్లో ఏం జరుగుతోందనేదీ ఆసక్తికరంగా మారింది.

# 'ఇండియా'కు డీఎంకే గుడ్‌బై

మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక సీట్లు కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ ఎంపీలతో కలిసి కూర్చోబోమని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ లేఖతో డీఎంకే-కాంగ్రెస్ మధ్య విభేదాలు బహిరంగంగా బయటపడ్డాయి. కాంగ్రెస్ ఇటీవల టీవీకేకు మద్దతు ప్రకటించడం డీఎంకేకు పెద్ద షాక్‌గా మారింది. డీఎంకే నేతృత్వం దీనిని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్‌కు ద్రోహంగా అభివర్ణించింది. దీంతో రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న డీఎంకే-కాంగ్రెస్ పొత్తు ఒక్కసారిగా ముగిసింది. డీఎంకే ఈ నిర్ణయం వల్ల ఇండియా కూటమి బలహీనపడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, టీవీకే-కాంగ్రెస్ కూటమి బలపడుతుందని అంచనా. తమిళనాడు రాజకీయాల్లో కొత్త సమీకరణాలు,కొత్త వ్యూహాలు రూపుదిద్దుకునే అవకాశం ఉంది.

# కేరళ సీఎం రేసులో కేసీ

మొదటి పేజీ తరువాయి

చెన్నితల ఉన్నారు. కాగా 63 ఏండ్ల వేణుగోపాల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, అలప్పుజ ఎంపీ. ఒకవేళ వేణుగోపాల్ ముఖ్యమంత్రి పదవికి ఎన్నికైతే, తన ఎంపీ పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. కాగా వచ్చే సోమవారం (మే 11) న కేరళ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవం జరిగే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, హాజరయ్యే అవకాశాలున్నాయి.

# బీసీ కులాల పేర్లు మార్పు

హైదరాబాద్, మే 8 (ఈవార్తలు): తెలంగాణలోని వెనుకబడిన తరగతుల (బీసీ) చిరకాల వాంఛను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలకమైన సామాజిక సంస్కరణకు శ్రీకారం చుట్టింది. సమాజంలో కించపరిచే విధంగా ఉన్న కొన్ని కులాల పేర్లను తొలగించి, వాటి స్థానంలో గౌరవప్రదమైన పేర్లను చేరుస్తూ రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. బీసీ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఆయా వర్గాల ఆత్మగౌరవం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మార్పులు తక్షణమే రాష్ట్ర గెజిట్ ద్వారా అధికారిక రికార్డుల్లోకి రానున్నాయి.

**ప్రభుత్వం చేపట్టిన ఈ మార్పుల్లో బీసీ గ్రూప్-ఏ విభాగంలో అత్యధిక మార్పులు జరిగాయి. ముఖ్యంగా వినడానికి అసభ్యకరంగా ఉన్న పదాలను రికార్డుల నుంచి పూర్తిగా తొలగించారు.**

**దొమ్మర:** ఈ పేరును తొలగించి 'గడ వంశీయ'గా మార్చారు.

**పిచ్చకుంట్ల:** ఇకపై ఈ కులస్తులను 'వంశ రాజ్'గా వ్యవహరిస్తారు.

**బుడబుక్కల:** వీరికి 'శివ క్షత్రియ' అనే గౌరవప్రదమైన పదాన్ని జోడించారు.

**వీరభద్రియ:** వీరి కోరిక మేరకు 'వీరముష్టి, నెట్టి కోటల' అనే పదాలను పర్యాయపదాలుగా చేర్చారు.

**వన్నార్:** ఈ పదాన్ని తొలగించి, రజక/చాకలి వర్గాల కోసం 'ధోబీ' అనే పదాన్ని ఖరారు చేశారు.

## గ్రూప్-డిలో 'శూద్ర' పదం తొలగింపు

బీసీ గ్రూప్-డి విభాగంలో కూడా ప్రభుత్వం సామాజిక స్పృహతో పలు మార్పులు చేసింది. ఎప్పటి నుంచో వివాదాస్పదంగా ఉన్న 'శూద్ర కులం' అనే పదాన్ని అధికారిక రికార్డుల నుంచి పూర్తిగా తొలగించారు. ఆ స్థానంలో 'తమ్మలి (బ్రాహ్మణేతర)'గా పేరు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనివల్ల ఆ వర్గానికి స్పష్టమైన సామాజిక గుర్తింపు లభిస్తుంది. అలాగే వరుస సంఖ్య 5లో ఉన్న 'మేర', 'చిప్పోలు' కులాలకు అదనంగా 'మేరు' అనే పదాన్ని చేర్చారు. ఈ



నిర్ణయం వల్ల భవిష్యత్తులో విద్యార్థులు, ఉద్యోగార్థులు తమ కుల ధ్రువీకరణ పత్రాల్లో గౌరవప్రదమైన పేర్లను పొందే అవకాశం కలుగుతుంది. సమాజంలో పిలిచేటప్పుడు కలిగే ఇబ్బందులను తొలగించి, ఆయా వర్గాల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే ఈ సంస్కరణ ముఖ్య ఉద్దేశమని బీసీ కమిషన్ వెల్లడించింది. కులాల పేర్ల మార్పుపై హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాలు, ఇది తమ సామాజిక హోదాను పెంచుతుందని అభిప్రాయపడుతున్నాయి.

## అవి కాకతీయ ఆలయ కూల్చివేతలు కావు

**పాఠశాల నిర్మాణ పనుల్లో బయటపడ్డ పాత శిథిల కట్టడం**

**వరంగల్ కలెక్టర్ స్పష్టీకరణ**

వరంగల్, మే 8 (ఈవార్తలు): వరంగల్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణం కోసం పురాతన ఆలయాన్ని కూల్చివేశారని వస్తున్న వార్తలను జిల్లా అధికారులు ఖండించారు. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, వాస్తవ పరిస్థితికి భిన్నంగా ఉన్నాయని శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ వివాదంపై స్పందించిన జిల్లా యంత్రాంగం, శిథిలావస్థలో ఉన్న కట్టడాన్ని పరిరక్షించి, పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చింది. వివరాల్లోకి వెళితే... ఖానాపూర్ మండలం పహాడ్ల అశోక్‌నగర్ గ్రామంలో ఈ నెల 6న ఆలయాన్ని కూల్చివేశారని కొన్ని మీడియా మాధ్యమాల్లో వార్తలు వచ్చాయి. దీనిపై వరంగల్ కలెక్టర్ కార్యాలయం స్పందిస్తూ ఓ వివరణ జారీ చేసింది. 6న నర్సంపేట రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, పురావస్తు శాఖ అధికారులు, ఖానాపూర్ తహసీల్దార్, తెలంగాణ విద్యా, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఈడబ్ల్యూఐడీసీ) ప్రతినిధులతో కలిసి సంయుక్తంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ కోసం కేటాయించిన 30 ఎకరాల భూమిలో దట్టమైన పొదలు, చెట్లు ఉన్నాయని, వాటిని తొలగించి చదును చేస్తుండగా ఒక పాత శిథిల కట్టడం అవశేషాలు బయటపడ్డాయని అధికారులు పేర్కొన్నారు. నిర్మాణ ఏజెన్సీ ఎలాంటి కూల్చివేతలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇది ప్రభుత్వ భూమి అని, దేవాదాయ శాఖకు చెందింది కాదని తేలింది. ఈ భూమిని గిరిజన సంక్షేమ శాఖకు ఇప్పటికే కేటాయించినట్లు తెలిపారు. పురావస్తు శాఖ అధికారుల ప్రకారం, ఈ కట్టడం వారి రికార్డులలో రక్షిత స్మారక చిహ్నంగా గానీ, పురావస్తు ప్రదేశంగా గానీ నమోదు కాలేదని వెల్లడైంది. చాలా కాలంగా ఈ కట్టడం శిథిలావస్థలోనే ఉందని, వాడుకలో లేదని సంయుక్త తనిఖీ బృందం గుర్తించింది. ఈ నేపథ్యంలో నిన్న వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, నర్సంపేట ఎమ్మెల్యే డి. మాధవరెడ్డితో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించారు. చరిత్రకారులు, స్థపతులు, పురావస్తు శాఖ నిపుణులతో సంప్రదించి అదే ప్రదేశంలో ఈ కట్టడాన్ని పునరుద్ధరిస్తామని వారు హామీ ఇచ్చారు.

# అభివృద్ధే అజెండా

**రాజకీయాలకున అతీతంగా కొడంగల్ అభివృద్ధి**

**సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి**

కొడంగల్, మే 8 (ఈవార్తలు): వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం కొడంగల్ ప్రతిష్ఠను మరింత పెంచుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కర్ణాటకలోని భక్తులకు కూడా ఈ ఆలయం మరింత చేరువగా ఉంటుందని అన్నారు. కొడంగల్‌లో శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వరస్వామి (కొడంగల్ బాలాజీ) ఆలయ పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా యాగంలో పాల్గొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా కొడంగల్ బాలాజీ ఆలయ పునర్నిర్మాణంతో పాటు కొడంగల్‌లో 430 పడకల ఆసుపత్రి నిర్మాణం, దౌలతాబాద్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా గ్రూపులు పక్కనపెట్టి అందరం కలిసికట్టుగా పనిచేస్తే కొడంగల్ శాసనసభ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే కాకుండా దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దగలుగుతామని అన్నారు. ప్రతి గ్రామంలో చిన్న సమస్యలు, బేదాభిప్రాయాలు ఉంటాయని, అవన్నీ పక్కన పెట్టి అందరూ కలిసి కట్టుగా ఉండాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని చాలామంది నాయకులు కలలు కన్నారని అన్నారు. కానీ వివిధ కారణాల చేత పలుమార్లు వాయిదాపడుతూ వచ్చిందని



వ్యాఖ్యానించారు. నియోజకవర్గాన్ని గొప్పగా అభివృద్ధి చేసుకోవాలన్న సంకల్పంతో తలపెట్టిన పనులు 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆనాడు చదువుకోవడానికి కొడంగల్ వాసులు ఇతర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు అందరూ కొడంగల్ వచ్చేలా అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు చురుగ్గా పనిచేయాలని అన్నారు. కృష్ణా-వికారాబాద్ రైల్వే లైన్‌కు కూడా సూత్రప్రాయంగా అనుమతులు తెచ్చుకున్నామని అన్నారు. ఇక్కడ అపారమైన సున్నపురాయి ఉందని తెలిపారు. టేకులగోడు ప్రాంతంలో పెద్ద ఎత్తున సిమెంట్ పరిశ్రమకు అన్ని అనుమతులు ఇచ్చామని అన్నారు. రాబోయే ఆరేళ్లలో సిమెంట్ పరిశ్రమ నిర్మాణం జరిగితే స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని అన్నారు. పెద్ద ఇండస్ట్రియల్ పార్కును లగచర్ల దగ్గర నిర్మిస్తున్నట్టు చెప్పారు. కోస్గి నుంచి నేరుగా అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 300 అడుగుల రోడ్డు వేస్తున్నట్లు చెప్పారు.

## రిటైర్డ్ ఐపీఎస్ భార్య దారుణ హత్య

**హైదరాబాద్‌లో ఘటన.. నేపాలీ పనిమనిషి హత్య చేసినట్లు గుర్తింపు**

హైదరాబాద్, మే 8 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య సునంద (55) దారుణ హత్యకు గురయ్యారు. బంగారం, డబ్బుల కోసం పనిమనిషి కల్పన ఆమెను హత్య చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కల్పనతో పాటు ఆమె గ్యాంగ్ ఈ హత్యకు పాల్పడిందని భావిస్తున్నారు. రిటైర్డ్ అధికారి నివాసంలో కల్పన పనిమనిషిగా చేరింది. పక్కా ప్లాన్‌తో ఏడెనిమిది నెలల పాటు కల్పన, ఆమె గ్యాంగ్ ఎదురుచూసినట్లు తెలుస్తోంది. ఇంటి ముందు నుంచి వస్తే సీసీటీవీ ఫుటేజీకి చిక్కుతామని భావించి, వెనుక నుంచి వచ్చి ఈ హత్యకు పాల్పడ్డారు. కల్పనతో సహా మొత్తం ముగ్గురు ఈ హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. హత్య తర్వాత పారిపోయే క్రమంలో ఒక నిందితుడి క్యాప్ కిందపడటంతో పోలీసులు దానిని స్వాధీనం చేసుకున్నారు. సునంద భర్త వినయ్ రంజన్ రే ప్రస్తుతం బెంగళూరులో ఉన్నారు. సునంద ఒంటరిగా ఉన్న విషయాన్ని గుర్తించిన కల్పన, ఈ విషయాన్ని తన గ్యాంగుకు చేరవేసి వారిని రప్పించింది. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ హత్య జరిగింది. కల్పన నేపాల్‌కు చెందిన మహిళ. డబ్బులు, బంగారం చోరీ కోసమే ఈ హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్య జరిగినట్లు తమకు సమాచారం వచ్చిందని హైదరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. రాత్రి రెండు గంటల సమయంలో హత్య జరిగిందని తెలిపారు. నేపాలీ గ్యాంగ్ ఈ హత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని అన్నారు. కొన్ని ఆధారాలు సేకరించామని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని సజ్జనార్ అన్నారు. నోట్లో గుడ్డలు కుక్కి హత్య చేశారని వెల్లడించారు. బంగారం, నగలు ఎత్తుకుపోయారా లేదా తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. వెనుక గేటు నుంచి వచ్చి హత్య చేసినట్లు చెప్పారు. కాగా, ఘటనా స్థలాన్ని డీజీపీ సీవీ ఆనంద్, సీపీ సజ్జనార్ పరిశీలించారు.

## లిఫ్ట్ వల్లే రాష్ట్రంపై భారం

**తుమ్మిడిహట్టి నుంచి గ్రావిటీ ద్వారా నీరు ఇవ్వొచ్చు**

**కానీ దాన్ని పక్కన పెట్టి కాళేశ్వరంపై కేసీఆర్ మక్కువ**

ఆసిఫాబాద్, మే 8 (ఈవార్తలు): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న తెలంగాణ పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రధానంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన సాగునీటి విధానాలపై విమర్శలు గుప్పించారు. సహజసిద్ధమైన ప్రవాహం (గ్రావిటీ) ద్వారా నీటిని అందించే అవకాశమున్న తుమ్మిడిహట్టిని పక్కన పెట్టి, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా విద్యుత్ ఖర్చుతో కూడిన 'లిఫ్ట్' విధానాన్ని ఎంచుకోవడం వల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందని ఆయన మండిపడ్డారు. 2008లో వైసీపీ హయాంలో 16 లక్షల ఎకరాల లక్ష్యంతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టును కాళేశ్వరం పేరుతో రీ-డిజైన్ చేయడం వల్ల సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి ప్రాంతాల రైతులకు అన్యాయం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోవడంతో ప్రస్తుతం ఆ ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తుమ్మిడిహట్టిని పూర్తి చేయడానికి సిద్ధంగా ఉందని జూపల్లి స్పష్టం చేశారు. 150 మీటర్ల బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించే ప్రయత్నం చేస్తామని, దీనివల్ల పొరుగు రాష్ట్రంలో ముంపు సమస్య ఉండదని ఆయన వివరించారు.


నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines – Rs.450
(for each extra line – Rs.90)

COLOUR:
Price for 5 Lines – Rs.500
(for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 Email: contact@evarthalu.com



## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## వెయ్యి బీడీలకు రూ.6 పెంపు

**బీడీ కార్మికులకు గుడ్ న్యూస్.. 7 లక్షల మంది కార్మికులకు లబ్ధి**

**ప్యాకర్లు, ఇతర సిబ్బంది జీతాల్లోనూ పెరుగుదల**

హైదరాబాద్, మే 8 (ఈవార్తలు): తెలంగాణలోని లక్షలాది మంది బీడీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. బీడీ పరిశ్రమ యాజమాన్యాలు, కార్మిక సంఘాల మధ్య జరిగిన చర్చలు ఫలించడంతో కార్మికుల వేతనాలు పెరిగాయి. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఈ మేరకు కొత్త వేతన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం 2028 ఏప్రిల్ 30 వరకు అమల్లో ఉంటుంది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 7 లక్షల మంది కార్మికులు లబ్ధి పొందనున్నారు. తాజా ఒప్పందం ప్రకారం వెయ్యి బీడీలు చుడితే కార్మికులకు ఇచ్చే వేతనాన్ని రూ.6 మేర పెంచేందుకు యాజమాన్యాలు అంగీకరించాయి. ప్రస్తుతం వెయ్యి బీడీలకు రూ.268.31 చెల్లిస్తుండగా, పెంపు తర్వాత అది రూ.275.23కు చేరనుంది. జాతీయ సెలవులు, బోనస్ వంటివి కలుపుకొంటే వెయ్యి బీడీలపై మొత్తం రూ.6.92 (15.33%) పెరుగుదల ఉంటుందని కార్మిక సంఘాలు తెలిపాయి. తెలంగాణలో బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వారిలో 98 శాతం మంది మహిళలే కావడం గమనార్హం. ప్రధానంగా నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట, మెదక్, జనగాం జిల్లాల్లో ఈ పరిశ్రమ విస్తరించి ఉంది. నిజామాబాద్‌ను బీడీ పరిశ్రమకు కేంద్రంగా పరిగణిస్తారు. ప్రతి రెండేళ్లకోసారి కార్మిక సంఘాలు యాజమాన్యాలతో చర్చలు జరిపి వేతన ఒప్పందాలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. బీడీలు చుట్టే కార్మికులతో పాటు పరిశ్రమలో పనిచేసే ఇతర సిబ్బందికి కూడా ఈ ఒప్పందంలో లబ్ధి చేకూరింది. దాదాపు 12,000 నుంచి 14,000 మంది ఉండే ప్యాకర్లు, బట్టీవాలాలు, మునిమ్‌లు, ఇతర క్లర్క్‌ల జీతాలను కూడా పెంచారు. బీడీ ప్యాకింగ్ కార్మికులకు నెలకు రూ.4,500, మిగిలిన ఉద్యోగులకు నెలకు రూ.2,200 చొప్పున వేతనం పెరగనుంది. ఈసారి కేవలం రూ.3 మేర మాత్రమే పెంపు ఉంటుందని మొదట భావించినప్పటికీ, చర్చల్లో యాజమాన్యాలను ఒప్పించి రూ.6 పెంపు సాధించామని కార్మిక సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

## కేటీఆర్‌లా దోచుకోవడం తెలియదు

**కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం**

కరీంనగర్, మే 8 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌లా దోచుకోవడం, దాచుకోవడం తనకు తెలియదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు వేసి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారని, అలా హింసించడం తనకు తెలియదని అన్నారు. వారిలా డ్రగ్స్ తీసుకోవడం కూడా తనకు తెలియదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం, ఫార్ములా ఈ రేస్ కేసు, విద్యుత్ కొనుగోళ్లలో అవినీతి చేయడం తమకు తెలియదని ఎద్దేవా చేశారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని లేదంటే పరిస్థితులు మరోలా ఉంటాయని హెచ్చరించారు. వారి అహంకారం వల్లనే కేసీఆర్ ఓడిపోయి ఫామ్ హౌస్‌కు పరిమితమయ్యారని వ్యాఖ్యానించారు. వరుస ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతున్నప్పటికీ కేటీఆర్‌లో మార్పు రావడం లేదని వ్యాఖ్యానించారు. పరేడ్ మైదానంలో ఈ నెల 10వ తేదీన జరగబోయే ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం వేల కోట్ల రూపాయల నిధులు ఇస్తోందని అన్నారు. కేంద్ర నిధులతో తెలంగాణలో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతోందని అన్నారు. కేంద్రం నిధులివ్వకపోతే తెలంగాణ అభివృద్ధి చెందుతుందా అని ప్రశ్నించారు.

# కార్మికులకు కోట్లు పంచిన ఓనర్

## అమెరికాలో 1.7 బిలియన్ డాలర్లకు కంపెనీ అమ్మకం.. ఉద్యోగులకు 240 మిలియన్ డాలర్లు పంచిన యాజమాన్యం

**సగటున ఒక్కో ఉద్యోగికి రూ. 3.75 కోట్ల లబ్ధి**

మైండెన్: అమెరికాలో ఓ కుటుంబం 43 ఏళ్లుగా నడిపిన తమ కంపెనీని అమ్మేసి, ఉద్యోగుల పట్ల అపూర్వమైన ఉదారతను చాటుకుంది. కంపెనీ అమ్మకం ద్వారా వచ్చిన మొత్తంలో భారీ వాటాను ఉద్యోగులకు పంచి, వారిని రాత్రికి రాత్రే కోటీశ్వరులను చేసింది. ఈ ఘటన లూసియానా రాష్ట్రంలోని మైండెన్ నగరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, వాకర్ కుటుంబీకులు ఫైబర్‌బాండ్ కార్పొరేషన్ అనే విద్యుత్ పరికరాల తయారీ కంపెనీని నడిపేవారు. ఇటీవలే ఈ కంపెనీని పవర్ మేనేజ్‌మెంట్ దిగ్గజం 'ఈటన్'కు 1.7 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 14,500 కోట్లు) అమ్మేశారు. అయితే, అమ్మకం ఒప్పందంలో కంపెనీ సీఈఓ గ్రాహం వాకర్ ఒక కీలక షరతు పెట్టారు. అమ్మకం ద్వారా వచ్చిన మొత్తంలో 15 శాతానికి సమానమైన 240 మిలియన్ డాలర్లను (సుమారు రూ. 2000 కోట్లు) కంపెనీలోని 540 మంది పూర్తిస్థాయి ఉద్యోగులకు పంచాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంతో సగటున ప్రతి ఉద్యోగి సుమారు 4,43,000 డాలర్లు (దాదాపు రూ. 3.75 కోట్లు) అందుకోనున్నారు. విశేషమేమిటంటే, ఈ ఉద్యోగుల్లో ఎవరికీ కంపెనీలో ఎలాంటి వాటాలు (ఈక్విటీ) లేవు. ఈ బోనస్‌ను జూన్ నుంచి ఐదేళ్ల వ్యవధిలో చెల్లిస్తారు. ఉద్యోగులు కంపెనీలో కొనసాగితేనే పూర్తి మొత్తం అందుతుంది. అయితే, 65 ఏళ్లు పైబడిన వారికి ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు. 1982లో ప్రారంభమైన ఈ కంపెనీ అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంది. 1998లో ఫ్యాక్టరీ దగ్ధమవడం, డాట్-కామ్ సంక్షోభం వంటి కష్టకాలంలోనూ యాజమాన్యం అండగా నిలవడంతో ఉద్యోగులు ఎంతో విధేయత చూపారు. ఇటీవల ఏఐ, క్లౌడ్ డిమాండ్ పెరగడంతో కంపెనీ అమ్మకాలు 400 శాతం పెరిగాయి. ఈ నేపథ్యంలోనే కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన ఉద్యోగులకు బహుమతి ఇవ్వాలని వాకర్ కుటుంబం నిర్ణయించుకుంది. బోనస్ విషయం



తెలియగానే ఉద్యోగులు ఆశ్చర్యం, ఆనందంతో ఉప్పొంగిపోయారు. కొందరు ఆనందభాష్పాలు రాల్చగా, "ఇక్కడ రహస్య కెమెరాలు ఏమైనా ఉన్నాయా?" అని ఓ ఉద్యోగి నమ్మలేనట్టు అడిగాడు. ఈ డబ్బుతో కొందరు తమ ఇంటి అప్పులు తీర్చుకోగా, మరికొందరు వ్యాపారాలు ప్రారంభించేందుక రెడీ అవుతున్నారు. డిసెంబర్ 31న సీఈఓ పదవి నుంచి వైదొలిగిన గ్రాహం వాకర్, తన ఉద్యోగుల పట్ల చూపిన ఈ ఔదార్యం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది.

# సోషల్ మీడియా 'సీఎం'గానే మమత

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ శాసనసభను గవర్నర్ ఆర్.ఎన్. రవి రద్దు చేయడంతో మమతా బెనర్జీ అధికారికంగా 'మాజీ ముఖ్యమంత్రి' అయ్యారు. గురువారం సాయంత్రం ఈ మేరకు ప్రకటన వెలువడింది. అసెంబ్లీ రద్దుతో ఆమె నేతృత్వంలోని కేబినెట్ కూడా రద్దయింది. అయితే, అధికారికంగా పదవి కోల్పోయినప్పటికీ, ఆమె తన సోషల్ మీడియా ఖాతాలైన ఎక్స్ (ట్విట్టర్), ఫేస్‌బుక్‌లలో మాత్రం ఇప్పటికీ 'పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి'గానే తనను తాను పేర్కొంటున్నారు. ఇటీవల జరిగిన 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించి, 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు తెరదించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజైన మే 5న మమత ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, తాను రాజీనామా చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ ఫలితాలు ప్రజల అసలైన తీర్పును ప్రతిబింబించడం లేదని ఆమె వ్యాఖ్యానించారు. భవానీపూర్ నియోజకవర్గంలో సువేందు అధికారి చేతిలో ఆమె 15,000 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. కాగా, 2011లో ఎన్నికల ఫలితాల సరళి తృణమూల్‌కు అనుకూలంగా ఉందని తేలగానే, బుద్ధదేవ్ భట్టాచార్య అర్ధరాత్రి 1 గంట సమయంలో రాజ్‌భవన్‌కు వెళ్లి తన రాజీనామాను గవర్నర్‌కు సమర్పించారు.



ముఖ్యమంత్రి హోదాలో ప్రభుత్వ వాహనంలో రాజ్‌భవన్‌కు వెళ్లిన ఆయన, రాజీనామా సమర్పించిన తర్వాత తిరిగి తన పార్టీ (సీపీఎం) ఏర్పాటు చేసిన కారులో ఇంటికి వెళ్లారు. వెళ్లే ముందు తన భద్రతా సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపి, వారిని విధులనుంచి రిలీవ్ చేశారు. ఈ రెండు సంఘటనలను పోలుస్తూ బీజేపీ నేత, కేంద్ర సహాయ మంత్రి సుకాంత మజుందార్ స్పందించారు. "బుద్ధదేవ్ భట్టాచార్య, మమతా బెనర్జీకి మధ్య పోలికే లేదు. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ, బుద్ధదేవ్ నిజాయతీపరుడని, అధికారం కోసం ఎన్నడూ పాకులాడని వ్యక్తి అని నేను అంగీకరిస్తాను" అని ఆయన అన్నారు. ఓటమిని హుందాగా స్వీకరించిన ఒక నాయకుడికి, అధికారం పోయినా అంగీకరించని మరో నేతకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రియల్‌లో ఏఐ అదరహో

**2047 నాటికి 9 రెట్లు పెరుగుదల!**

న్యూఢిల్లీ: భారత రియల్ ఎస్టేట్ రంగం భవిష్యత్తులో అద్భుతమైన వృద్ధిని సాధించనుందని, 2047 నాటికి ఈ మార్కెట్ విలువ ప్రస్తుతంతో పోలిస్తే దాదాపు 9 రెట్లు పెరిగి 5.8 ట్రిలియన్ డాలర్లకు (సుమారు 49 లక్షల కోట్ల రూపాయలు) చేరుకుంటుందని ఫిక్కీ-కేపీఎంజీ సంయుక్త నివేదిక అంచనా వేసింది. తాజానివేదిక, టెక్నాలజీ వినియోగం ఈ వృద్ధికి కీలక చోదకశక్తిగా నిలుస్తుందని స్పష్టం చేసింది. రియల్ ఎస్టేట్‌లో టెక్నాలజీ విప్లవం వస్తోందని, ఏఐ వాడకంలో భారీ పెరుగుదల నమోదవుతోందని తెలిపింది. ప్రస్తుతం 2025లో భారత రియల్ ఎస్టేట్ మార్కెట్ విలువ 650 బిలియన్ డాలర్లుగా (సుమారు 5.5 లక్షల కోట్ల రూపాయలు) ఉంది. ఇది దేశ జీడీపీలో 7.3 శాతం వాటాను కలిగి ఉంది. నగరీకరణ, పెరుగుతున్న ఆదాయాలు, సంస్థాగత పెట్టుబడులతో పాటు సాంకేతికత వినియోగం పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణాలని నివేదిక పేర్కొంది. రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు సాంప్రదాయిక పద్ధతుల నుంచి డిజిటల్ వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ ట్విన్స్, బ్లాక్‌చెయిన్, డ్రోన్లు వంటి టెక్నాలజీల వినియోగం పెరుగుతోంది. కార్పొరేట్ రియల్ ఎస్టేట్‌లో ఏఐ వాడకం 2023లో 5 శాతం కంటే తక్కువ ఉండగా, 2025 నాటికి అది ఏకంగా 91 శాతానికి పెరగడం గమనార్హం. పెరుగుతున్న నిర్మాణ వ్యయాలు, కఠినమైన నియంత్రణలు, పారదర్శకత కోసం కొనుగోలుదారుల నుంచి వస్తున్న ఒత్తిడి వంటి కారణాలతో కంపెనీలు టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నాయి. 'వికసిత భారత్' లక్ష్య సాధనలో ఉపాధి కల్పన, ఆర్థిక వృద్ధికి రియల్ ఎస్టేట్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని నివేదిక అభిప్రాయపడింది. వివిధ మార్గాల ద్వారా ఇప్పటికే 16 బిలియన్ డాలర్లకు పైగా మూలధనం అందుబాటులోకి రావడం కూడా ఈ రంగంలో పారదర్శకతను పెంచుతోంది.




## ప్రభుత్వ ఏర్పాటులో
# జాప్యం వద్దు: స్టాలిన్

చెన్నై: తమిళనాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడి, పాత శాసనసభ కూడా రద్దయిన ప్రస్తుత తరుణంలో ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం చేయడం తగదని ఆయన హితవు పలికారు. ఈ మేరకు స్టాలిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. "తమిళనాడు శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఎన్నికైన ఎమ్మెల్యేల జాబితాను ఎన్నికల సంఘం అధికారికంగా విడుదల చేసింది. దీనికి తోడు, పాత శాసనసభను రద్దు చేస్తూ గౌరవనీయ గవర్నర్ గారు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు" అని ఆయన గుర్తుచేశారు.



"ఈ పరిస్థితుల్లో రాష్ట్ర సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు, ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేసేందుకు కొత్త ప్రభుత్వం ఏర్పడటం అత్యవసరం. ఇది కేవలం కాలం యొక్క ఆవశ్యకత మాత్రమే కాదు, ప్రజాస్వామ్యంలో ఒక ముఖ్యమైన విధి" అని స్టాలిన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. అందువల్ల, ప్రభుత్వ ఏర్పాటులో ఎలాంటి ఆలస్యం జరగకుండా, రాజ్యాంగం ప్రకారం కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలను గవర్నర్ వెంటనే తీసుకోవాలని డీఎంకే తరఫున తాను కోరుతున్నట్లు స్టాలిన్ స్పష్టం చేశారు.

# స్టాక్ మార్కెట్లు భారీ పతనం

ముంబై: అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు రాజుకోవడం భారత స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. శుక్రవారం నాటి ట్రేడింగ్‌లో మదుపరులు అన్ని రంగాల్లో అమ్మకాలకు మొగ్గు చూపడంతో సూచీలు భారీ నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 516.33 పాయింట్లు నష్టపోయి 77,328.19 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 150.50 పాయింట్లు తగ్గి 24,176.15 వద్ద ముగిసింది. ఈ అమ్మకాల ఒత్తిడికి ప్రధానంగా బ్యాంకింగ్ షేర్లు నాయకత్వం వహించాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్, బ్యాంక్ సూచీలు భారీగా నష్టపోయాయి. ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆర్థిక రంగ షేర్ల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఎస్‌బీఐ, కోల్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ అత్యధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. అయితే, ఐటీ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్ల నష్టాలు కొంతమేర తగ్గాయి. టైటాన్, అపోలో హాస్పిటల్స్, ఏషియన్ పెయింట్స్ షేర్లు మాత్రం మార్కెట్ బలహీనతను తట్టుకుని లాభపడ్డాయి. నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 24,250-24,300 స్థాయి తక్షణ నిరోధకంగా ఉంది. దీనిని దాటితేనే మార్కెట్లో సానుకూలత పెరుగుతుంది. అదే సమయంలో, 24,100-24,000 స్థాయి కీలక మద్దతుగా పనిచేస్తుందని వారు అంచనా వేస్తున్నారు. మరోవైపు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడిచమురు ధరలు పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర 0.66% పెరిగి బ్యారెల్‌కు 100.72 డాలర్లకు చేరింది. హోర్ముజ్ జలసంధి సమీపంలో అమెరికా, ఇరాన్ మధ్య వివాదం మళ్లీ మొదలవ్వడంతో ప్రపంచ మార్కెట్లలో ఆందోళన నెలకొంది. ఇది ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెంచుతుందనే భయాలు వ్యక్తమవుతున్నాయి.

## 13న పుదుచ్చేరి సీఎంగా
# రంగసామి ప్రమాణం

పుదుచ్చేరి: ఏఐఎన్‌ఆర్‌సీ అధినేత ఎన్.రంగసామి ఈ నెల 13వ తేదీన పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రంగసామి ఈరోజు లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాసనాథ్‌ను కలిసి తనకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన బలం ఉందని తెలిపారు. ఈ మేరకు తనకు మద్దతుగా ఉన్న ఎమ్మెల్యేల జాబితాను అందజేశారు. రంగసామి వెంట కూటమి పార్టీలకు చెందిన కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఉన్నారు. రంగసామి సమర్పించిన లేఖను ఆమోదం కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించనున్నట్లు లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 30 సీట్లున్న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 18 స్థానాలను గెలుచుకుంది. ప్రభుత్వ ఏర్పాటుకు కేంద్రమంత్రి మాండవీయ, రంగసామి నేతృత్వంలో మిత్ర పక్ష నాయకులు, ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఎన్డీయే కూటమి నాయకుడిగా రంగసామిని ఎన్నుకున్నారు. కూటమిలోని పార్టీలు ఆయనకు మద్దతుగా లేఖలను అందజేశాయి. అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ కైలాసనాథ్‌ను లోక్ నివాస్‌లో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కూటమి నేతలు కోరారు.

# ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం.. ముగ్గురి మృతి

న్యూఢిల్లీ: ఇండోనేషియాలో మరోసారి అగ్నిపర్వతం బద్దలైంది. నార్త్ మలుకు ప్రావిన్స్‌లోని దుకోనో అగ్నిపర్వతం శుక్రవారం ఉదయం విస్ఫోటనం చెందింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక పోలీసులు ధ్రువీకరించారు. పర్వతంపై చిక్కుకుపోయిన సుమారు 20 మంది పర్వతారోహకులను సురక్షితంగా తరలించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 7:40 గంటలకు ఈ విస్ఫోటనం సంభవించింది. దీని ప్రభావంతో సుమారు 10 కిలోమీటర్ల ఎత్తు వరకు దట్టమైన బూడిద మేఘాలు ఆకాశంలోకి ఎగిసిపడ్డాయి. అగ్నిపర్వత బిలం నుంచి 4 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టవద్దని అధికారులు ప్రజలను హెచ్చరించారు. వర్షాలు కురిస్తే అగ్నిపర్వత బురద ప్రవాహాలు (మడ్‌ఫ్లోస్) సంభవించే ప్రమాదం ఉందని కూడా హెచ్చరికలు జారీ చేశారు. దుకోనో అగ్నిపర్వతం ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా విస్ఫోటనం చెందింది. ఆ సమయంలో విమానయాన రంగానికి అధికారులు ఆరెంజ్ లెవెల్ హెచ్చరిక జారీ చేశారు. బూడిద కారణంగా శ్వాసకోశ సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రజలు మాస్కులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సముద్ర మట్టానికి 1,087 మీటర్ల ఎత్తులో ఉన్న దుకోనో, ఇండోనేషియాలోని 127 క్రియాశీల అగ్నిపర్వతాలలో ఒకటి. గత నెలలో ఇండోనేషియాలోని మౌంట్ సెమేరు అగ్నిపర్వతం కూడా పలుమార్లు విస్ఫోటనం చెందిన విషయం తెలిసిందే.

## ఎన్డీయేను అడ్డుకొనేందుకే
# విజయ్‌కు మద్దతు: కాంగ్రెస్

చెన్నై: తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటు కోసం టీవీకేకు మద్దతు ఇస్తున్నందుకు తమ పార్టీపై విమర్శలు గుప్పిస్తున్న వారిపై కాంగ్రెస్ పార్టీ ఎంపీ మాణికం ఠాకూర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీవీకే మొదటి నుంచి బీజేపీకి వ్యతిరేకమని, అందుకే తాము ఆ పార్టీకి అండగా నిలిచామని అన్నారు. స్థిరమైన ప్రభుత్వ ఏర్పాటు కోసం, ప్రజల తీర్పును గౌరవించేందుకు, దక్షిణాది రాష్ట్రంలో ఎన్డీయేను అధికారానికి దూరంగా ఉంచేందుకు టీవీకేకు మద్దతిచ్చామని తెలిపారు. ఫలితాలు వెలువడిన రోజు రాహుల్ గాంధీ స్టాలిన్‌కు, మమతా బెనర్జీకి ఫోన్ చేశారని చెప్పారు. బెంగాల్‌లో బీజేపీ 100 స్థానాలలో ఓటు చోరీకి పాల్పడిందని మమతా బెనర్జీ చేసిన ఆరోపణలను, రాహుల్ గాంధీ కూడా సమర్థించారని గుర్తు చేశారు. కానీ ఎన్డీయేకు వ్యతిరేకంగా తమిళనాడులో టీవీకేకు మద్దతివ్వాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. కానీ ఇప్పుడు మాత్రం డీఎంకే మీడియా కాంగ్రెస్ పార్టీపై బురద జల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎంకే, అన్నాడీఎంకే బీజేపీ ఆశీస్సులతోనే తమపై విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. వాస్తవానికి తమిళనాడులోని డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు మరో ఎన్డీయేగా చెప్పవచ్చని అన్నారు. వారి అభిప్రాయం మేరకు, ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడానికి మేం సహకరించాలా అని ధ్వజమెత్తారు. టీవీకేకు అండగా నిలిచినందుకు తాము ఎవరికీ క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు.

**విజయ్‌కు బయటి నుంచే మద్దతు**

విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మద్దతు ఇచ్చేందుకు వామపక్ష పార్టీలు (సీపీఐ, సీపీఎం) ముందుకు వచ్చాయి. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు సహకరిస్తామే తప్ప, కేబినెట్‌లో చేరి మంత్రి పదవులు చేపట్టబోమని స్పష్టం చేశాయి. టీవీకే పార్టీకి బయటి నుంచే మద్దతు ఇస్తామని ఉద్ఘాటించాయి. రాష్ట్రంలో మతవాద శక్తులు పాగా వేయకుండా అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే టీవీకేకు మద్దతు ఇస్తున్నట్లు వామపక్షాలు ప్రకటించాయి. దేశవ్యాప్తంగా మతతత్వానికి వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని, అందులో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించాయి. అదే సమయంలో, తమ చిరకాల మిత్రపక్షమైన డీఎంకేతో బంధం కొనసాగుతుందని వామపక్షాలు స్పష్టం చేయడం గమనార్హం. ప్రజా సమస్యలు, రాష్ట్ర ప్రయోజనాల కోసం డీఎంకేతో కలిసి పనిచేస్తామని తెలిపాయి.

# అమెజాన్ గ్రేట్ సమ్మర్ సేల్ ప్రారంభం

**ప్రైమ్ మెంబర్ల కోసం ప్రత్యేక ఆఫర్లు**




న్యూఢిల్లీ: అమెజాన్ గ్రేట్ సమ్మర్ సేల్ 2026 ప్రారంభమైంది. ప్రైమ్ మెంబర్ల కోసం ముందే అందుబాటులోకి వచ్చిన ఈ సేల్‌లో స్మార్ట్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులపై భారీ డిస్కౌంట్లు లభిస్తున్నాయి. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ కార్డ్ వినియోగదారులకు 10 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్ (గరిష్టంగా రూ. 9,500 వరకు) అదనపు ప్రయోజనంగా ఉంది. శాంసంగ్ ఫ్లాగ్‌షిప్ ఫోన్ శాంసంగ్ గెలాక్సీ ఎస్25 అల్ట్రా 5జీ ధర భారీగా తగ్గింది. రూ. 1,29,999 ఉన్న ఈ ఫోన్ ఇప్పుడు రూ. 99,999 కే లభిస్తోంది. దీనికి తోడు పాత ఫోన్‌ను ఎక్స్ఛేంజ్ చేయడం ద్వారా రూ. 70,000 వరకు అదనపు డిస్కౌంట్ పొందే అవకాశం ఉంది. అలాగే రూ. 2,000 విలువైన కూపన్ డిస్కౌంట్ కూడా అందుబాటులో ఉంది. బడ్జెట్ ఫోన్ చూస్తున్న వారి కోసం రెడ్ మీ ఏ7 ప్రో 5జీ రూ. 11,999 (రూ. 15,999)కే లభిస్తోంది. ఇందులో 6.9 ఇంచుల డిస్ప్లే, 6,300ఎమ్ఏహెచ్ భారీ బ్యాటరీ ప్రధాన ఆకర్షణలు. ఆపిల్ ఐప్యాడ్ ప్రియుల కోసం ఆపిల్ ఐపాడ్ 11-అంగుళాల (ఏ16 చిప్) మోడల్ రూ. 32,900 ధర వద్ద సేల్‌లో ఉంది. ఎక్స్ఛేంజ్ ఆఫర్ ద్వారా దీని ధరను రూ. 31,150 వరకు తగ్గించుకోవచ్చు. ఇక లాప్‌టాప్ విభాగంలో ఆసస్ వివోబుక్ 15 (13వ్ష జెన్ ఇంటెల్ కోర్ ఐ5, 16జీబీ ర్యామ్) రూ. 59,990 కే లభిస్తోంది. పాత లాప్‌టాప్‌ను ఎక్స్ఛేంజ్ చేస్తే మరో రూ. 8,850 వరకు ఆదా చేయవచ్చు. ఇటీవలే లాంచ్ అయిన శాంసంగ్ 43-అంగుళాల క్రిస్టల్ యూహెచ్ డీ 4కే విజన్ ఏఐ స్మార్ట్ టీవీపై అమెజాన్ రూ. 2,000 ఫ్లాట్ డిస్కౌంట్ ఇస్తోంది. ప్రొడక్ట్ పేజీలోని కూపన్‌ను ఉపయోగించి ఈ డిస్కౌంట్ పొందవచ్చు. దీనికి అదనంగా క్రెడిట్ కార్డ్ ఆఫర్ల ద్వారా మరో రూ. 1,750 వరకు తగ్గించుకునే వెసులుబాటు ఉంది.

# బంకర్లలోనే పుతిన్

**రష్యా అధ్యక్షుడి హత్యకు కుట్ర!**

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై హత్యాయత్నం జరిగినట్టు వస్తున్న వార్తలు అంతర్జాతీయ స్థాయిలో పెను సంచలనం రేపుతున్నాయి. ముఖ్యంగా ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్న ఈ తరుణంలో, పుతిన్ తన భద్రతను అత్యంత కట్టుదిట్టం చేసుకోవడం గమనార్హం. ఈ ప్రపంచంలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత కలిగిన నేతలలో పుతిన్ ఒకరు. రష్యా ఫెడరల్ ప్రొటెక్టివ్ సర్వీస్ (ఎఫ్ఎస్ఓ) ఆయనను 24 గంటలూ ఒక కవచంలా కాపాడుతుంది. మాస్కో అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, కొన్ని నెలల క్రితం నోవ్‌గోరోడ్ ప్రాంతంలోని పుతిన్ ప్రైవేట్ నివాసం వద్ద పుతిన్ పై హత్యాయత్నం జరిగింది. అయితే భద్రతా కారణాల రీత్యా ఈ విషయాన్ని బయటకు వెల్లడించలేదు. హత్యాయత్నం నేపథ్యంలో, పుతిన్ భద్రతను భారీగా పెంచారు. ఈ కుట్ర నేపథ్యంలో పుతిన్ తన బహిరంగ పర్యటనలను పూర్తిగా తగ్గించుకున్నారు. యుద్ధ పర్యవేక్షణ కోసం ఆయన ఎక్కువ సమయం అత్యాధునిక సౌకర్యాలున్న భూగర్భ బంకర్లలోనే గడుపుతున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొంటున్నాయి. పుతిన్ ఉండే ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ ఆధారిత పరికరాలపై పూర్తి నిషేధం విధించారు. ఉక్రెయిన్ డ్రోన్ల ముప్పు నుంచి తప్పించుకోవడానికి మాస్కో నది వెంబడి భారీగా భద్రతా బలగాలను మోహరించారు. రష్యా వర్గాలు ఉక్రెయిన్‌పై ఆరోపణలు చేస్తున్నప్పటికీ, అటు అమెరికా, ఇటు ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ సంస్థలు ఈ వార్తలను తోసిపుచ్చాయి. పుతిన్‌ను నేరుగా లక్ష్యంగా చేసుకోవడం వల్ల కలిగే అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా ఇలాంటి కుట్రలకు తాము పాల్పడలేదని వారు వాదిస్తున్నారు. గతంలో కూడా పుతిన్‌పై కనీసం ఐదు నుంచి ఆరు సార్లు హత్యాయత్నాలు జరిగినట్లు చరిత్ర చెబుతోంది.

# అక్కాతమ్ముళ్ల పెళ్లి!

**కర్ణాటకలో అమానుష ఘటన**

చిక్కబళ్లాపూర్: కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్ జిల్లాలో ఓ వింత ప్రేమకథ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మరికొన్ని గంటల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన వధువు, వరుసకు తమ్ముడయ్యే సొంత పిన్ని కొడుకుతో లేచిపోయి పెళ్లి చేసుకోవడమే కాకుండా, తమకు రక్షణ కల్పించాలంటూ పోలీస్ స్టేషన్ మెట్లెక్కడం సంచలనం రేపింది. మూడేళ్ల ప్రేమ కోసం కట్టుబాట్లను, రక్తసంబంధాన్ని కాదనుకుని ఈ జంట తీసుకున్న నిర్ణయం స్థానికంగా పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. వివరాల్లోకి వెళితే... బెంగళూరు గ్రామీణ జిల్లా దేవనహళ్లికి చెందిన శశికళ, హోస్కోట్‌కు చెందిన ప్రవీణ్ గత మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరి తల్లులు స్వయానా అక్కాచెల్లెళ్లు కావడంతో వరుసకు శశికళ అక్క, ప్రవీణ్ తమ్ముడు అవుతారు. ఈ విషయం తెలిసిన ఇరు కుటుంబాల పెద్దలు వీరి ప్రేమను తీవ్రంగా వ్యతిరేకించారు. సమాజం అంగీకరించని ఈ బంధాన్ని వదులుకోవాలని హెచ్చరించారు. ఈ క్రమంలో శశికళ తల్లిదండ్రులు ఆమెకు వేరే యువకుడితో వివాహం నిశ్చయించి, పెళ్లి పత్రికలు కూడా పంచారు. వివాహానికి అన్ని ఏర్పాట్లు పూర్తికాగా, పెళ్లికి కొన్ని గంటల ముందు శశికళ తన ప్రియుడు ప్రవీణ్‌తో కలిసి ఇంటి నుంచి పారిపోయింది. అనంతరం అంగట్ట ప్రాంతంలోని ఓ శివాలయంలో ఇద్దరూ వివాహం చేసుకున్నారు.

# సంచుల్లేవ్.. లారీల్లేవ్!

## మంత్రి అడ్లూరిని నిలదీసిన రైతులు.. జగిత్యాల బీట్‌బజార్‌లో ఆందోళన

జగిత్యాల, మే 8 (ఈవార్తలు): జగిత్యాల బీట్‌బజార్ మార్కెట్ యార్డ్‌లో అకాల వర్షాలకు తడిసిన మక్కలు, వరి ధాన్యాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న రైతులు తమ సమస్యలను మంత్రికి వివరించి ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డ్‌లో ధాన్యం కొనుగోళ్లు మందగిస్తున్నాయని, రాజకీయ పలుకుబడి ఉన్న రైతుల ధాన్యానికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. చిన్న రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. 15 నుంచి 20 రోజులుగా కొనుగోలు కేంద్రానికి వస్తున్నప్పటికీ సంచులు ఇవ్వడం లేదని, లారీలు అందుబాటులో లేక ధాన్యం తరలింపు జరగడం లేదని రైతులు తెలిపారు. అకాల వర్షాలతో మార్కెట్ యార్డ్‌లో నిల్వ ఉంచిన మక్కలు, వరి ధాన్యం తడిసి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం తడిస్తే తమ పరిస్థితి దయనీయంగా మారుతుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను విన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులతో మాట్లాడి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు అవసరమైన సంచులు, లారీల ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

**ధాన్యం కొనుగోళ్లలో వేగం పెరగాలి**

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటిస్తూ రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. అకాల వర్షాల



సమయంలో రైతులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, తూకం యంత్రాలు తదితర సౌకర్యాలు కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



## నూతన దంపతులకు అడువాల జ్యోతి ఆశీర్వాదం

జగిత్యాల, మే 8 (ఈవార్తలు): జగిత్యాల పట్టణ 13వ వార్డు కౌన్సిలర్ వరలక్ష్మీ శ్రీనివాస్ గారి అల్లుడి వివాహ శుభకార్యానికి జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకలో కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించిన అడువాల జ్యోతి లక్ష్మణ్, దాంపత్య జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. శుభకార్యాలు కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## జనగణనలో ఎమ్మెల్యే సంజయ్ వివరాలు నమోదు

జగిత్యాల, మే 8 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా చేపడుతున్న జనగణన–2027 కార్యక్రమంలో భాగంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా తన కుటుంబ వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన జనగణన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని, ప్రతి కుటుంబం తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. సరైన గణాంకాలు సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పురపాలక కమిషనర్ సత్య ప్రణవ్, నాయకులు సమీండ్ల శ్రీనివాస్, టీపీబీఓ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ గృహ ప్రవేశాల్లో సంజయ్**

జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన మూగల వరలక్ష్మి–హరీష్, జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన బల్గూరి సరిత–రవీందర్‌రావు, అంతర్గం గ్రామానికి చెందిన అల్లెపు రజిత–శేఖర్, జ్యోతి–నరేష్, జగిత్యాల పట్టణ 19వ వార్డుకు చెందిన బొల్లి పరమేశ్వరి–శేఖర్ కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, లబ్ధిదారులకు చీరలను కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ గృహ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్లు దామోదర్‌రావు, నక్కల రవీందర్‌రెడ్డి, సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద యువతి పెళ్లికి అండగా ఎస్సై రాజు

**రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేత**

బీర్పూర్, మే 8 (ఈవార్తలు): బీర్‌పూర్ గ్రామానికి చెందిన సిరికొండ సత్తయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కొంతకాలం క్రితం మృతి చెందాడు. కుటుంబ పెద్దను కోల్పోయిన ఆ కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఇదే సమయంలో వారి కుమార్తె వివాహం నిశ్చయమవడంతో కుటుంబ పరిస్థితిని స్థానిక సర్పంచ్ ఎలమట్ల హరీష్ బీర్‌పూర్ ఎస్ఐ సబ్బని రాజుకు వివరించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజు వెంటనే స్పందించి మానవతా దృక్పథంతో తన వంతు సహాయంగా రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా, ఆ నిరుపేద కుటుంబానికి దాతలు ముందుకు వచ్చి తోచిన సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీర్‌పూర్ సర్పంచ్ ఎలమట్ల హరీష్, వార్డు సభ్యులు కోడిమ్యాల శ్యామల సుభాష్, మంద సుభాష్, గోపి ప్రసాద్, పూదూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ఈవీఎం గోదాం తనిఖీ

జగిత్యాల, మే 8 (ఈవార్తలు): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం దరూర్ క్యాంప్‌లో ఉన్న ఈవీఎంల భద్రపరిచిన గోదామును తనిఖీ చేశారు. గోదాములోని భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, సాంకేతిక అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రతినెలా ఈవీఎంలను తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. గోదాములోని యంత్రాల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, పటిష్టమైన భద్రతా చర్యలు కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. నిత్యం అప్రమత్తతతో పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు, కలెక్టరేట్ కిషన్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్రామిరెడ్డి తొలగింపు..

**ఏపీ ప్రభుత్వానికి నోటీసులు**

అమరావతి, మే 8 (ఈవార్తలు): ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కె. వెంకట్రామిరెడ్డి తనను సర్వీసు నుంచి తొలగించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ నిర్ణయంపై న్యాయపోరాటం చేస్తానని గతంలో ప్రకటించిన ఆయన, అన్నంత పనీ చేశారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు, ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన, పంచాయతీరాజ్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో పాటు విచారణాధికారిగా వ్యవహరించిన కడప జిల్లా కలెక్టర్‌కు కూడా నోటీసులు పంపింది. తదుపరి విచారణను జూన్ నెలకు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ డి. రమేశ్ తెలిపారు. తనను ఉద్యోగం నుంచి తొలగిస్తూ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని వెంకట్రామిరెడ్డి తన పిటిషన్‌లో కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో వెంకట్రామిరెడ్డి సర్వీస్ నిబంధనలను ఉల్లంఘించి, వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేశారని తీవ్ర ఆరోపణలు వచ్చాయి. మార్చి 31న కడప జిల్లాలోని పలు పీటీడీ (ప్రజా రవాణా శాఖ) డిపోల్లో ఆయన రాజకీయ ప్రచారం నిర్వహించారని టీడీపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ప్రభుత్వ ఉద్యోగిగా రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడంపై ఈసీ సీరియస్‌గా స్పందించింది. ఈ ఫిర్యాదుపై స్పందించిన కడప జిల్లా కలెక్టర్, ఆయనపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేశారు. దీంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం వెంకట్రామిరెడ్డిని సస్పెండ్ చేసింది. అనంతరం ఆయన ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో, కడప కలెక్టర్‌నే విచారణాధికారిగా నియమించింది. సుదీర్ఘ విచారణ జరిపిన కలెక్టర్, వెంకట్రామిరెడ్డి నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారిస్తూ 2025 ఏప్రిల్‌లో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు.



## రైతుల వ్యతిరేక ప్రభుత్వం

**కొనుగోళ్లలో ఇంత జాప్యమేల?.. మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం.. గొల్లపల్లిలో రైతులతో కలిసి జాతీయ రహదారిపై ధర్నా**

గొల్లపల్లి, మే 8 (ఈవార్తలు): ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గొల్లపల్లి మార్కెట్ కమిటీలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని పరిశీలించిన ఆయన రైతులతో కలిసి జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నప్పటికీ కొనుగోళ్లు మందగించాయని విమర్శించారు. కల్లాల వద్ద కాంటాలు సరిగా నిర్వహించడం లేదని, లారీలు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బస్తాలకు, క్వింటాళ్లకు అధికంగా కటింగ్ చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, తక్షణమే ఎలాంటి కోతలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ధర్నాలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణ వేగం పెరగాలి: అడ్లూరి

ధర్మపురి, మే 8 (ఈవార్తలు): ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. మరో నెల రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు. మంత్రి వెంట పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, నేరెళ్ల సర్పంచ్ బాలగౌడ్, ధర్మపురి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు రాజస్థాన్ ఉత్తమ వృషభాలు

హైదరాబాద్, మే 8 (ఈవార్తలు): గోవంశ సంరక్షణ, జాతి అభివృద్ధికి తెలంగాణలోని గోశాలల కోసం ఉత్తమ జాతి వృషభాలను అందించేందుకు రాజస్థాన్ ప్రభుత్వం అంగీకరించిందని తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ తెలిపారు. శుక్రవారం నగరంలో జరిగిన 'గ్లోబల్ రాజస్థాన్ అగ్రిటెక్ మీట్' కార్యక్రమంలో గోశాల ఫెడరేషన్, 'లవ్ ఫర్ కౌ' సంస్థల ప్రతినిధి బృందం రాజస్థాన్ పశుసంవర్ధక, డెయిరీ, గోపాలన శాఖ మంత్రి జోరారామ్ కుమావత్ ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కాచిగూడ ప్రాంతానికి చెందిన లవ్ ఫర్ కౌ ట్రస్టీ రితీష్ జాగీర్దార్, మహేష్ అగర్వాల్ మాట్లాడుతూ.. పాలలో నాణ్యత పెంచడానికి, దేశీ ఆవుల జాతిని మెరుగుపరచడానికి రాజస్థాన్ శ్రేష్టమైన వృషభాలను ఉచితంగా అందించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ విషయంలో మంత్రి జోరారామ్ కుమావత్ సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. రాజస్థాన్ ప్రభుత్వ నిర్ణయం పట్ల తెలంగాణ లోని గోపాలకులు. గోశాలల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ఇది గో సంరక్షణ దిశగా పడిన ఒక గొప్ప ముందడుగు అని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖేష్ చౌహాన్, దిలీప్ పాలివాల్, జస్రాజ్ శ్రీశ్రీమాల్, తదితరులు పాల్గొన్నారు.

## 16న జగిత్యాలకు ఆర్టీఐ కమిషన్

జగిత్యాల, మే 8 (ఈవార్తలు): ఈ నెల 16న జగిత్యాలకు తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ రానున్న సందర్భంగా ఆర్టీఐ కార్యకర్తలు, అన్ని శాఖల అధికారులకు సంయుక్తంగా సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించాలని సీనియర్ ఆర్టీఐ కార్యకర్త, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఆయన, ఆర్టీఐ రెండో అప్పీల్ కేసుల విచారణ కోసం సమాచార కమిషన్ జగిత్యాలకు వస్తోందని తెలిపారు. జిల్లాలో అనేక శాఖల్లో ఆర్టీఐ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అధికారులకు సరైన అవగాహన లేకపోవడంతో సమాచారం అందించడంలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టం–2005పై అధికారులు, కార్యకర్తలకు సమగ్ర అవగాహన కల్పించేలా సదస్సు నిర్వహించాలని, అందులో సీనియర్ ఆర్టీఐ కార్యకర్తలకు మాట్లాడే అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.

**ఇందిరమ్మ గృహ భూమిపూజలో గోపాల్ రెడ్డి**

ఎండపల్లి, మే 8 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గొడిసెలపేట గ్రామంలో ఒరగంటి సతీష్ నూతన ఇందిరమ్మ గృహ భూమిపూజ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ సింగిల్ విండో చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ గృహ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ గూడ రాంరెడ్డి, సర్పంచ్ కందికట్ల అమృత రాజేష్, ఉప సర్పంచ్ గోపు భాగ్య కేశవ్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



వయ్యారి చిత్రం







# విజయ్ గెలిస్తే త్రిషకు అభినందనలా?

గాయత్రి శంకర్

విజయ్ వ్యక్తిగత జీవితంపై కోలీవుడ్ నటి గాయత్రి శంకర్ సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కోలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారాయి. ఆమె తన ఇన్స్టాగ్రామ్ లో నేమ్స్ లేకుండా ఒక మెసేజ్ పెట్టారు అది విజయ్ త్రిష గురించే అని సోషల్ మీడియా అంటుంది . విజయ్ విజయానికి త్రిష కారణమంటూ ఆమెను విష్ చేస్తున్న వారిపై గాయత్రి అసహనం వ్యక్తం చేశారు. ఒక పురుషుడి స్థానంలో మహిళ ఉంటే సొసైటీ ఇదే విధంగా రెస్పాండ్ అయ్యేదా అంటూ ఆమె క్వశ్చన్ చేశారు. ఒక హీరోయిన్ తన సహనటుడితో వివాహేతర సంబంధం పెట్టుకుని కుటుంబాన్ని విడదీస్తే సమాజం అస్సలు సహించదని గాయత్రీ అభిప్రాయపడ్డారు. అప్పుడు అదే ప్రజలు తీవ్రంగా విమర్శించేవారని, ఇంటి నుంచి బయటికి రావడానికే ఆమె భయపడే పరిస్థితి వచ్చేదంటూ ఆమె ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నిజానికి విజయ్– త్రిష జంటకు తమిళ సినీ ఇండస్ట్రీలో ప్రత్యేకంగా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. 2004లో విడుదలైన గిల్లీ సినిమాలో ఆ జంట మొదటి సారి కలిసి నటించింది. తెలుగు చిత్రం ఒక్కడుకు రీమేక్ గా వచ్చిన ఆ మూవీ తమిళంలో బ్లాక్ బస్టర్ హిట్ అయింది. ఆ తర్వాత తిరుపాచి, ఆది, కురువి, ఇటీవల వచ్చిన లియో చిత్రాల్లో కూడా వీరిద్దరూ కలిసి నటించారు. ప్రత్యేకంగా లియో సినిమా తర్వాత వీరిద్దరి క్లోజ్ నెస్ పై సోషల్ మీడియాలో చర్చ మరింత పెరిగింది.



## సాయి పల్లవి నిజాయితీకి హ్యాట్సాఫ్!

నేచురల్ బ్యూటీ సాయి పల్లవి రీసెంట్ గా బాలీవుడ్ లో అడుగుపెట్టగా, ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. డెబ్యూ హిందీ మూవీ ఏక్ దిన్ తో ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆమె.. సినిమాలో తాను పోషించిన పాత్రకు సూట్ అవ్వలేదేమోనని అనిపించిందని చెప్పడం చర్చనీయాంశమైంది. కొన్ని రోజుల క్రితం ఆ సినిమా ప్రమోషన్స్ లో చేసిన కామెంట్స్ ఇప్పుడు మళ్లీ ట్రెండ్ అవుతున్నాయి. బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ కొడుకు జునైద్ ఖాన్ హీరోగా నటించిన ఆ చిత్రాన్ని అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. ప్రేమకథా నేపథ్యంలో రూపొందిన ఆ సినిమా భారీ అంచనాల మధ్య విడుదలైనా.. ఆశించిన స్థాయిలో ఆడియన్స్ నుంచి రెస్పాన్స్ పొందలేకపోయింది. ముఖ్యంగా సౌత్ ఆడియన్స్ కు ఆ కథ, పాత్రలు అంతగా కనెక్ట్ కాలేదన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇక ఆ సినిమాకు ఓకే చెప్పడానికి కారణాల గురించి మాట్లాడిన సాయి పల్లవి.. “ఆ సమయంలో నేను వరుసగా భావోద్వేగాలకు సంబంధించిన సినిమాల్లో నటిస్తున్నా. అందుకే మనసుకు హాయిగా అనిపించే కథ చేయాలని అనిపించింది. ఏక్ దిన్ కథ విన్నప్పుడు నాకు బిఫోర్ సన్ రైజ్ సినిమా గుర్తొచ్చింది. ఆ చిత్రం నాకు చాలా ఇష్టం. అందుకే వెంటనే ఓకే చెప్పా” అని తెలిపారు. కానీ సినిమా ప్రీమియర్ షో చూసిన తర్వాత మాత్రం తనపై తనకు డౌట్ వచ్చిందని ఆమె చెప్పారు.

## 3:20 గంటల రన్‌టైంతో పెద్ది



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, స్టార్ డైరెక్టర్ బుచ్చిబాబు సానా కలయికలో వస్తున్న మోస్ట్ ఎవెయిటెడ్ చిత్రం ‘పెద్ది’. ఈ మూవీ జూన్ 4న గ్రాండ్ థియేట్రికల్ రాబోతుందని ఇప్పటికే చిత్ర బృందం అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇవ్వగా.. షూటింగ్‌కు సంబంధించిన పనులు చకచక కానిచ్చేస్తున్నారు మేకర్స్. ఈ క్రమంలోనే తాజాగా ఈ మూవీ షూటింగ్ బీటీఎస్‌కి సంబంధించిన వీడియోను షేర్ చేశాడు డైరెక్టర్ బుచ్చిబాబు. ‘మన హృదయానికి దగ్గరగా ఉండే కొన్ని సరదా బీటీఎస్ క్షణాలు ఇవి.. మెగాస్టార్ చిరంజీవి, మావెరిక్ డైరెక్టర్ సుకుమార్ పెద్ది షూటింగ్‌కి వచ్చి విజట్ చేశారు. పెద్ది ప్రపంచవ్యాప్తంగా జూన్ 4న రాబోతుండగా, జూన్ 3న ప్రీమియర్లతో స్టార్ట్ అవుతాయి. త్వరలో ట్రైలర్ అనౌన్స్‌మెంట్ ఉంది’ అంటూ షేర్ చేసిన ఈ వీడియోలో మెగాస్టార్ చిరంజీవి పెద్ది సెట్స్‌కు విచ్చేసి చిత్ర యూనిట్‌ను ఆశ్చర్యపరిచారు. అక్కడ జరుగుతున్న షూటింగ్ ప్రక్రియను దగ్గరుండి పరిశీలించిన ఆయన, రామ్ చరణ్ లుక్, దర్శకుడు బుచ్చిబాబు మేకింగ్ విధానాన్ని చూసి ముగ్ధులయ్యారు.



## సౌత్ వైపు క్యూ: సమీరా

టాలీవుడ్, బాలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితురాలైన నటి సమీరా రెడ్డి తన కెరీర్ మొదట్లో తీసుకున్న సాహసోపేత నిర్ణయాల గురించి తాజాగా నోరు విప్పారు. జూనియర్ ఎన్టీఆర్ సరసన ‘నరసింహుడు’ సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఆమె అప్పట్లో దక్షిణాది ఇండస్ట్రీ గురించి ఉత్తరాదిలో ఉన్న తప్పుడు అభిప్రాయాలను వెల్లడించారు. సమీరా రెడ్డి తన కెరీర్ ప్రారంభంలో హిందీ సినిమాలతో బిజీగా ఉన్నప్పుడు సౌత్ సినిమాల ఆఫర్లు వచ్చాయట. కానీ ఆమె టీమ్ మాత్రం “హిందీలో అవకాశాలు లేని ఫ్లాప్ హీరోయిన్లు మాత్రమే సౌత్ సినిమాల వైపు వెళ్తారు” అని భయపెట్టారట. కానీ సమీరా మాత్రం ఆ మాటలను ఏమాత్రం పట్టించుకోలేదని తెలిపింది. ఒక సౌత్ ఇండియన్ అమ్మాయిగా మన ఇండస్ట్రీ పట్ల తనకు ఉన్న గౌరవాన్ని చాటుకుంటూ ధైర్యంగా ముందుకు వెళ్లినట్లు చెప్పింది. “నా టీమ్ వద్దు అని చెప్పినా నేను వినలేదు. ఎందుకంటే నేను చిరంజీవి, ఎన్టీఆర్, సూర్య, అజిత్, మోహన్ లాల్ వంటి దిగ్గజాలతో పని చేయడం నా అదృష్టంగా భావిస్తున్నా..



## నయనతార ఇండియా సూపర్ స్టార్

దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేకమైన సామ్రాజ్యాన్ని సృష్టించుకున్న నటి నయనతార. గ్లామర్ పాత్రల నుంచి పవర్‌ఫుల్ లేడీ ఓరియెంటెడ్ సినిమాల వరకు ఆమె ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకం. అందుకే ఆమెను అభిమానులు గౌరవంగా లేడీ సూపర్ స్టార్ అని పిలుచుకుంటారు. తాజాగా, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ నయనతారపై చేసిన ప్రశంసలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఓ ఇంటర్వ్యూలో నయనతార గురించి మాట్లాడిన కరీనా కపూర్.. ఆమె నటనను ఆకాశానికెత్తేశారు. “మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చిన అత్యుత్తమ నటీమణులలో నయనతార ఒకరు. ఆమె నటన చాలా సహజంగా ఉంటుంది. నిజం చెప్పాలంటే, నయనతార భారతదేశపు అతిపెద్ద మహిళా సూపర్ స్టార్” అంటూ కరీనా కపూర్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా ఉన్న కరీనా నుండి ఇలాంటి ప్రశంసలు రావడం నయనతార రేంజ్ ఏంటో మరోసారి నిరూపించింది.



# క్రికెట్ నిబంధనల్లో మార్పులు చేయాల్సిందే : గవాస్కర్



టీ20 క్రికెట్ ఫార్మాట్ ఇటీవల కాలంలో పూర్తిగా మారిపోయింది. 20 ఓవర్లలోనే బ్యాటర్లు 250కి పైగా పరుగులు చేయగలుగుతున్నారు. బౌలర్లు ఎన్ని విధాలుగా ప్రయత్నించినా బ్యాటర్లను ఆపడం కష్టతరమవుతుంది. ఇదే విషయంపై టీమిండియా దిగ్గజం సునీల్ గావస్కర్ స్పందించాడు. టీ20 క్రికెట్ వచ్చాక ఆట పూర్తిగా బ్యాటర్ల వైపు మళ్లిందని ఆందోళన వ్యక్తం చేశాడు. బౌండరీలు చిన్నవిగా ఉండటం, ఫీల్డింగ్ పరిమితులు పెరగడం, పవర్‌ఫుల్ బ్యాట్లు రావడం వల్ల బౌలర్ల పరిస్థితి దయనీయంగా మారిందని పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో క్రికెట్ నిబంధనల్లో కీలక మార్పులు అవసరమని సూచించాడు. టీమిండియా దిగ్గజం, ఐసీసీ క్రికెట్ కమిటీ ఛైర్మన్ సౌరవ్ గంగూలీకి ఈ విషయంపై కీలక విజ్ఞప్తి చేశాడు. 'బ్యాటర్‌కు ఇలాంటి షాట్ ఆడొద్దని చెప్పలేం కదా! బౌలర్లకు మాత్రం ఎందుకు అన్ని ఆంక్షలు? తదుపరి ఐసీసీ సమావేశంలో బౌలర్ల పరిస్థితిపై కూడా ఆలోచించండి. బౌన్సర్ వైడ్ నిబంధనను సవరించి పేసర్లకు కొంత వెసులుబాటు కల్పించాలి. బౌలర్ వేసిన బౌన్సర్ బ్యాటర్ తలకు కొద్దిగా ఎత్తుకు వెళ్లినా అది 'వైడ్'గా ప్రకటిస్తున్నారు. ఇది పేసర్‌ను ఒక చేతిని కట్టేసి బౌలింగ్ చేయమన్నట్లే ఉంటుంది. బౌలర్లకు కూడా కొంత స్వేచ్ఛ ఇవ్వాలి. బ్యాటర్ సాధారణ స్టాన్స్ కంటే ఒక అడుగు ఎత్తులో వెళ్లే బంతిని వైడ్‌గా పరిగణించకుండా ఉంటే పేసర్లకు కాస్త ఉపశమనం లభిస్తుంది' అని గంగూలీని గావస్కర్ కోరాడు.



## కేఎల్ రాహుల్ కొత్త రికార్డు

ఈ సీజన్‌లోనూ దుమ్మురేపుతున్న కేఎల్ రాహుల్.. శుక్రవారం కోల్‌కతా నైట్ రైడర్స్‌తో మ్యాచ్ సందర్భంగా అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. అరుణ్‌జైట్లీ మైదానంలో శుక్రవారం నాటి మ్యాచ్‌లో 14 బంతుల్లో 23 పరుగులు చేసిన రాహుల్.. ఢిల్లీ తరపున వెయ్యి పరుగుల మార్కు అందుకున్నాడు. మొత్తంగా ఈ సీజన్‌లో ఇప్పటికి 11 ఇన్నింగ్స్‌లో కలిపి 468 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలోనే రాహుల్ అరుదైన ఫీట్ సాధించాడు. ఐపీఎల్ చరిత్రలో మూడు వేర్వేరు జట్ల తరపున వెయ్యి పరుగుల మైలురాయిని చేరుకున్న ఏకైక బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు. కాగా 2013లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తరపున ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన కేఎల్ రాహుల్.. ఆ తర్వాత పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లకు ఆడాడు. గతేడాది ఢిల్లీ క్యాపిటల్స్‌తో జట్టుకట్టిన రాహుల్.. తాజాగా వెయ్యి పరుగులు పూర్తి చేసుకున్నాడు. అంతకు ముందు పంజాబ్ కింగ్స్, లక్నో తరఫునా ఈ ఘనత సాధించాడు.

## వ్లాగింగ్ వద్దు

### అర్ష్‌దీప్‌కు బీసీసీఐ వార్నింగ్

పంజాబ్ కింగ్స్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ కు ఊహించని షాక్ తగిలింది. అర్ష్‌దీప్ సింగ్ చేసే వ్లాగింగ్, యూట్యూబ్ వీడియోలపై భారత క్రికెట్ నియంత్రణ మండలి సీరియస్ అయినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 ముగిసే వరకు వాటిని ఆపేయాలని అర్ష్‌దీప్ సింగ్ కు బీసీసీఐ ఆదేశాలు జారీ చేసినట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఇటీవల విమానంలో చాహల్ వేపింగ్ చేశారన్న వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన నేపథ్యంలో వ్లాగింగ్ ఆపేయాలని అర్ష్‌దీప్ సింగ్ కు సూచనలు చేసిందట బీసీసీఐ. ప్రతి మ్యాచ్ అనంతరం అర్ష్‌దీప్ సరదాగా రీల్స్ చేసి పోస్టు చేస్తుంటారు. ఈ క్రమంలోనే తాజాగా చాహల్ ఈ-సిగరెట్ తాగుతున్నట్లు అర్ష్‌దీప్ సింగ్ పోస్ట్ చేసిన వీడియోలో స్పష్టంగా కనిపించింది. ఈ వీడియో వైరల్ గా మారింది. దీనిపై తీవ్ర స్థాయిలో నెటిజెన్స్ నుంచి విమర్శలు వచ్చాయి. ఈ తరుణంలోనే బీసీసీఐ రియాక్ట్ అయిందట. వ్లాగింగ్ తాత్కలింగా ఆపాలని సూచనలు చేసినట్లు టాక్.



# కేకేఆర్‌దే గెలుపు



## ఫిన్ అలెన్ సెంచరీ.. ఢిల్లీపై ఘన విజయం

ఐపీఎల్ 2026 సీజన్‌లో కేకేఆర్ వరుసగా నాలుగో విజయాన్ని అందుకుంది. శుక్రవారం ఢిల్లీ వేదికగా జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ ఢిల్లీ క్యాపిటల్స్‌పై 8 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఫిన్ అలెన్ సెంచరీతో విధ్వంసం సృష్టించడంతో కేకేఆర్ సునాయాస విజయాన్ని అందుకుంది.

**ఢిల్లీ విధించిన 143 పరుగుల లక్ష్యాన్ని కేకేఆర్ 14.2 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఫిన్ అలెన్ (47 బంతుల్లోనే 100 నాటౌట్) అజేయ సెంచరీ సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కామరున్ గ్రీన్ 33 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.**

ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్ ఒక్క వికెట్ తీశాడు. అంతకముందు కేకేఆర్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. ఓపెనర్ పాతుమ్ నిస్సాంక (50) అర్ధసెంచరీతో రాణించగా.. చివర్లో అశుతోశ్ శర్మ (39) మినహా మిగతా బ్యాటర్లు పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. కేకేఆర్ బౌలర్లలో అనుకుల్ రాయ్, కార్తిక్ త్యాగి చెరో 2 వికెట్లు పడగొట్టగా, వైభవ్ అరోరా, సునీల్ నరైన్, గ్రీన్ తలా ఒక వికెట్ తీశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఓపెనర్లు పాతుమ్ నిస్సాంక, కేఎల్ రాహుల్ శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు ఈ జోడీ 4.6 ఓవర్లలో 49 పరుగులు సాధించారు. రాహుల్ ఔటైన తర్వాత నిస్సాంక ఒక ఎండ్‌లో నిలబడినప్పటికీ ఢిల్లీ క్రమంగా వికెట్లు కోల్పోతూ వచ్చింది. 29 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన నిస్సాంక ఔటైన తర్వాత ఢిల్లీ ఇన్నింగ్స్ నత్తనడకన సాగింది. ఆఖర్లో అశుతోశ్ శర్మ 28 బంతుల్లో 39 పరుగులు చేయడంతో ఢిల్లీ గౌరవప్రదమైన స్కోరును సాధించింది. 143 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కేకేఆర్‌కు ఆరంభంలో దురదృష్టం వెంటాడింది. అజింక్యా రహానే రనౌట్ కాగా, అంగ్‌క్రిష్ రఘువంశీ వికెట్ల మీదకు ఆడుకొని వెనుదిరిగారు. ఈ ఇద్దరు ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన కామెరున్ గ్రీన్‌తో కలిసి ఫిన్ అలెన్ ఇన్నింగ్స్ కొనసాగించాడు. 32 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన ఫిన్ అలెన్ ఆ తర్వాత గేర్ మార్చాడు. ఢిల్లీ బౌలర్లను చీల్చి చెండాడిన అలెన్ బౌండరీలు, సిక్సర్ల వర్షం కురిపించాడు. తొలి 50 పరుగులకు 32 బంతులు తీసుకున్న ఫిన్ అలెన్ రెండో ఫిఫ్టీకి కేవలం 15 బంతులే తీసుకోవడం విశేషం. ఫిన్‌కు తోడు గ్రీన్ కూడా రెచ్చిపోవడంతో 34 బంతులు మిగిలి ఉండగానే కేకేఆర్ విజయాన్ని అందుకుంది. సెంచరీతో విధ్వంసం సృష్టించిన ఫిన్ అలెన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ విజయంతో కేకేఆర్ 11 మ్యాచ్‌ల్లో 4 విజయాలతో పట్టికలో ఏడో స్థానానికి చేరుకోగా, అదే సమయంలో ఢిల్లీ క్యాపిటల్స్ 11 మ్యాచ్‌ల్లో ఏడు ఓటములతో 8వ స్థానానికి పడిపోయింది.

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| హైదరాబాద్ | 11 | 7 | 4 | 14 |
| పంజాబ్ | 10 | 6 | 3 | 13 |
| బెంగళూరు | 10 | 6 | 4 | 12 |
| రాజస్థాన్ | 10 | 6 | 4 | 12 |
| గుజరాత్ | 10 | 6 | 4 | 12 |
| చెన్నై | 10 | 5 | 5 | 10 |
| కోల్‌కతా | 10 | 4 | 5 | 9 |
| ఢిల్లీ | 11 | 4 | 7 | 8 |
| ముంబై | 10 | 3 | 7 | 6 |
| లక్నో | 10 | 3 | 7 | 6 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓడినవి పా-పాయింట్లు

## వైభవమే: డివిలియర్స్



క్రికెట్ ప్రపంచంలో సరికొత్త సంచలనం వైభవ్ సూర్యవంశీ. గతేడాది కాలంగా ఫార్మాట్లకు అతీతంగా విధ్వంసకర బ్యాటింగ్‌తో విరుచుకుపడుతున్నాడు ఈ లెఫ్టాండర్ బ్యాటర్. ఇటు ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ తరఫునా.. అటు భారత్ అండర్-19 జట్టు తరఫున దుమ్ములేపుతున్నాడు. ఐపీఎల్-2026లో ఇప్పటికి పది మ్యాచ్‌లలో కలిపి 404 పరుగులు చేసిన వైభవ్.. అత్యధిక పరుగుల వీరుల జాబితాలో టాప్-5లో కొనసాగుతున్నాడు. ఈ నేపథ్యంలో త్వరలోనే అతడు అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టడం ఖాయమంటూ మాజీ క్రికెటర్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్ సంచలన రీతిలో స్పందించాడు. పదిహేనేళ్ల వైభవ్ సూర్యవంశీతో.. ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌లో తనను తాను నిరూపించుకుంటున్న 22 ఏళ్ల జేకబ్ బెతెల్‌ను పోల్చాడు. ఈ మేరకు.. "గతంలోనూ ఇతడి పేరును నేను పలుమార్లు ప్రస్తావించాను. అతడు అత్యద్భుతమైన ఆటగాడు.



## శ్రేయస్‌కు టీ20 పగ్గాలు?

టీమిండియా టీ20 జట్టులో భారీ మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇండియాకు 2026 టీ20 వరల్డ్‌కప్‌ను సూర్యకుమార్ అందించిన విషయం తెలిసిందే. అయితే అతన్ని సారథ్యం నుంచి తప్పించాలని బీసీసీఐ(దీజజ×) వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ .. కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి. టీమిండియా టీ20 కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్‌కు ఛాన్స్ ఇవ్వాలని బీసీసీఐ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ యేటి ఐపీఎల్ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ ఇరగదీస్తున్నాడు. రాబోయే సిరీస్‌ల్లో కెప్టెన్సీతో పాటు యువ ఆటగాళ్లకు కూడా అవకాశం ఇవ్వాలని బీసీసీఐ భావిస్తున్నది. ఐర్లాండ్, ఇంగ్లండ్ టూర్లకు వెళ్లే జట్టుల్లో యువతకు చోటు దక్కే ఛాన్సు ఉన్నది. ఇటీవల సూర్యకుమార్ యాదవ్ తన బ్యాట్‌కు పెద్దగా పనిచెప్పడం లేదు. సూర్య రాణించలేకపోతున్నాడని ఆరోపణలు వస్తున్నాయి. సెలక్షన్ కమిటీ చీఫ్ అజిత్ అగార్కర్ కూడా సూర్య విషయంలో సహనాన్ని కోల్పోయినట్లు తెలుస్తోంది. ఫామ్‌లో లేని సూర్య స్థానంలో శ్రేయాస్‌ను కెప్టెన్‌గా దించాలని భావిస్తున్నారు. మరీ పేలవంగా ఆడుతున్న సూర్య టీమిండియా బృందంలో చోటు దక్కించుకుంటాడా అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. నిజానికి టీ20ల్లో సూర్యకు మంచి రికార్డు ఉన్నది. కానీ ఇటీవల అతని ఫామ్ సరిగాలేదు. ఐపీఎల్ లో ఈసారి అతను ముంబై ఇండియన్స్ తరపున 10 మ్యాచుల్లో కేవలం 195 రన్స్ మాత్రమే చేశాడు. అయితే చేతిమడిమ సమస్యతో సూర్య బాధపడుతున్నాడని, అయినా నొప్పితోనే ఆడుతున్నాడని ఓ నివేదిక ద్వారా తెలిసింది. ఇక శ్రేయాస్ అయ్యర్ ఈ ఐపీఎల్ సీజన్‌లో 9 మ్యాచుల్లో 333 రన్స్ చేశాడు. అయితే రోహిత్ శర్మ కెప్టెన్‌గా రిటైర్మెంట్ అయిన తర్వాత సూర్యకుమార్ ఇప్పటి వరకు ఒక్క టీ20 సిరీస్‌ను కూడా కోల్పోలేదు. ఇక అయ్యర్ గత రెండేళ్ల నుంచి ఒక్క అంతర్జాతీయ టీ20 మ్యాచ్ కూడా ఆడలేదు. 2023 డిసెంబర్‌లో చివరిసారి అతను ఇండియా తరపున ఆడాడు.



## 2500 మంది విద్యార్థినులకు ధావన్ దంపతుల స్మార్ట్ విద్య

భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ ప్రత్యేక ఫౌండేషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇటీవలే ఆయన ఫౌండేషన్ కు విదేశీ నిధులు నేరుగా విరాళాలుగా వచ్చేందుకు కేంద్రం అనుమతించింది. తాజాగా శిఖర్ ధావన్ - సోఫీ ధావన్ దంపతుల ఈ ఫౌండేషన్ ద్వారా కీలక నిర్ణయం తీసుకున్నారు. ధావన్ ఆయన భార్య సోఫీ ధావన్ నేతృత్వంలోని ఎస్‌డీఎఫ్, ఢిల్లీలోని తుగ్లకాబాద్ విలేజ్‌లో ఉన్న సర్వోదయ కన్యా విద్యాలయలో 'డిజిటల్ శిక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇన్యువెన్ క్యాపిటల్ సీఎస్‌ఆర్ సహకారంతో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 2,500 మంది విద్యార్థినులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్య అందనుంది. క్లాస్‌రూమ్‌లలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, అత్యాధునిక డిజిటల్ కరిక్యులమ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా సైన్స్, మ్యాథ్స్, భాషలను దృశ్యరూపంలో సులభంగా అర్థం చేసుకునే సదుపాయం కలుగుతుంది. క్రికెటర్ శిఖర్ ధావన్ తన రెండో వివాహాన్ని ఐరిష్ ప్రొడక్ట్ కన్సల్టెంట్ అయిన సోఫీ షైన్ (ప్రస్తుతం సోఫీ ధావన్) తో ఫిబ్రవరి 2026 లో చేసుకున్నారు.

ఈవార్తలు ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శనివారం 9-5-2026, జగిత్యాల


నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# అన్నమయ్య మార్గం.. బ్రహ్మమొక్కటే!

పదిహేనవ శతాబ్దంలో తెలుగు నేలపై భక్తి రసామృతాన్ని కురిపించిన పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులు. 32 వేల కీర్తనలతో వేంకటేశ్వరుని అర్చించిన ఆయన ఒక భక్తుడు మాత్రమే కాదు, ఒక గొప్ప సామాజిక సంస్కర్త. ఐదు శతాబ్దాల క్రితం ఆయన ప్రబోధించిన విలువల అవసరం నేటి యాంత్రిక, విద్వేషపూరిత సమాజానికి ఎంతో ఉంది. కులమతాల కతీతంగా.. నేటికీ సమాజంలో కులం, మతం, అంతస్తుల పేరుతో విచక్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. అన్నమయ్య తన బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే సంకీర్తన ద్వారా మానవులందరూ ఒక్కటేనని చాటిచెప్పారు. నిందలన్నియును సమానమే అని చెప్పూ, రాజుకు, బంటుకు నిద్ర ఒకటేనని, అందరిలోనూ ఉన్న దైవత్వం ఒక్కటేనని ఉద్ఘాటించారు. ఆధునిక కాలంలో పెరిగిపోతున్న అసమానతలకు అన్నమయ్య దృక్పథమే సరైన మందు. పరుగుల ప్రపంచంలో ఒత్తిడి, ఆందోళనలతో మనిషి సతమతమవుతున్నాడు. వేగవంతమైన నేటి జీవితంలో సామాజిక సామరస్యం తగ్గిపోతోంది. అన్నమయ్య పాటలు ఆధ్యాత్మిక చింతననే కాదు, మనిషికి అంతర్మథనాన్ని, ప్రశాంతతను ప్రసాదిస్తాయి. అన్నీ నాకే కావాలి అనుకునే స్వార్థం నుండి అంతా ఆ పరమాత్మదే అనే తృప్తి వైపు మనల్ని నడిపిస్తాయి. నేడు భాష, సాహిత్యం వ్యాపారీకరణకు గురవుతున్నాయి. అన్నమయ్య జనభాషలో అంటే అచ్చ తెలుగు పదాలతో కవిత్వాన్ని సామాన్యులకు చేరువ చేశారు. రోలు, రోకలి వంటి గృహోపకరణాలను కూడా సాహిత్య గౌరవం కల్పించిన ఘనత ఆయనది. నేటి రచయితలు, కళాకారులు అన్నమయ్య చూపిన సరళతను, నిజాయతీని స్ఫూర్తిగా తీసుకోవాలి. అన్నమయ్య జీవితం మనకు నేర్పే పాఠం – నిరాడంబరత, నిబద్ధత. రాజ్యాధికారాన్ని కాదని, భగవంతుని సేవే (అంటే లోకహితమే) పరమావధిగా భావించిన ఆయన తత్వం నేటి నాయకులకు, పౌరులకు ఆదర్శప్రాయం. ఐదు వందల ఏళ్ల క్రితం ఆయన వినిపించిన ఆనాటి గళం, ఈనాటికీ ప్రతి ఇంటా ప్రతిధ్వనించడం తెలుగుజాతి సంస్కారానికి నిదర్శనం. ఆయన మార్గంలో నడవడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి.



క్రికెట్ పుట్టినప్పుడు అది 'బ్యాట్, బాల్' మధ్య సమాన పోరాటంగా ఉండేది. కానీ ఐపీఎల్ - 2026 నాటికి ఈ సమీకరణం పూర్తిగా మారిపోయింది.

నేడు క్రికెట్ మైదానం బౌలర్లకు ఒక వధశాలగా, బ్యాటర్లకు స్వర్గధామంగా రూపాంతరం చెందింది. 20 ఓవర్ల ఆటలో 250 నుంచి 300 పరుగులు సర్వసాధారణం అయిపోయాయి.

## బ్యాటర్ల సామ్రాజ్యం..

# స్వింగ్ సుల్తాన్

**బౌ**లర్ వేసే ప్రతి బంతి గాల్లోకి లేవడం లేదా బౌండరీ దాటడం ఒక నిత్యకృత్యంగా మారింది. ఐపీఎల్ 2026 సీజన్ రికార్డుల తిరగరాతకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్, చిన్న బౌండరీలు, ఫ్లాట్ పిచ్‌లు, ఆధునిక బ్యాట్ల తయారీ విధానం బౌలర్ల పాలిట శాపంగా మారాయి. మునుపెన్నడూ లేని విధంగా బ్యాటర్లు 360 డిగ్రీల కోణంలో విరుచుకుపడుతున్నారు. యార్కర్లు వేస్తే స్కూప్ షాట్లు, షార్ట్ బాల్స్ వేస్తే పుల్ షాట్లతో బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారు. ఒకప్పుడు ఓవర్ కి 8 పరుగులు ఇస్తే ఎకానమీ బౌలింగ్ అనుకునేవారు, కానీ ఇప్పుడు 10-12 పరుగులు ఇచ్చినా అది గొప్ప బౌలింగ్‌గా పరిగణించాల్సి రావడం బౌలింగ్ ప్రమాణాలు పడిపోవడానికి సంకేతం కాదు, బ్యాటింగ్ దూకుడుకు నిదర్శనం. యువ బౌలర్లు గంటకు 150 కిలోమీటర్ల వేగంతో బంతులు విసిరినా బ్యాటర్లు అలవోకగా సిక్సర్లు కొడుతున్నారు. బ్యాటర్ల ఆధిపత్యం క్రికెట్ మనుగడకు అత్యంత ప్రమాదకరం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే క్రికెట్‌లో సమతుల్యత దెబ్బతింటుంది. బౌలర్లు కేవలం బంతులు విసిరే యంత్రాలుగా మారిపోయే ప్రమాదం ఉంది. యువత బౌలర్లుగా మారడానికి భయపడే రోజులు రావచ్చు. ఆటలో మళ్ళీ బౌలర్ల ప్రాధాన్యం పెరగాలంటే పిచ్‌ల తయారీలో మార్పులు రావాలి. బౌండరీల దూరాన్ని పెంచాలి లేదా బౌలర్లకు అనుకూలించే నిబంధనలను ప్రవేశపెట్టాలి.

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా, తన అనుభవంతో, స్వింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను వణికిస్తున్న వెటరన్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ ప్రదర్శన ఒక అద్భుతం. భువనేశ్వర్ కుమార్ వేగం మీద కాకుండా 'వేరియేషన్' మీద ఆధారపడి సక్సెస్ అవుతున్నారు. వయసు పెరుగుతున్నా, తనలోని పదును తగ్గలేదని ఆయన నిరూపిస్తున్నారు. కొత్త బంతితో ఇన్‌స్వింగ్, అవుట్‌స్వింగ్‌లను నియంత్రిత పద్ధతిలో వేస్తూ పవర్‌ప్లేలో వికెట్లు తీయడం భువీ ప్రత్యేకత. బ్యాటర్లు విధ్వంసం సృష్టించే ఆఖరి ఓవర్లలో తన కచ్చితమైన యార్కర్లు, స్లోయర్ వన్లతో భువీ పరుగులను కట్టడి చేస్తున్నారు. ఎదురుగా ఏ బ్యాటర్ ఉన్నా తడబడకుండా, తన ప్రణాళికను అమలు చేయడంలో ఆయన చూపుతున్న సంయమనం అద్భుతం. బ్యాటర్ల సునామీలోనూ భువనేశ్వర్ కుమార్ లాంటి బౌలర్లు ఒక దీపస్తంభంలా నిలబడి పోరాడుతున్నారు. వేగం కంటే విజ్ఞతే ముఖ్యం అని ఆయన నిరూపిస్తున్నారు. ఐపీఎల్ 2026 సీజన్ బ్యాటర్లదే కావచ్చు, కానీ క్రికెట్ చరిత్రలో నిలబడే స్పెల్స్ మాత్రం భువీ లాంటి నైపుణ్యం ఉన్న బౌలర్లవే. ఆట అంతిమంగా బ్యాట్, బాల్ మధ్య సమాన సమరంగా ఉన్నప్పుడే దానికి అసలైన మజా ఉంటుంది.

# ఏంటో ఈ గవర్నర్లు..?

భారత రాజ్యాంగం ప్రకారం గవర్నర్ పదవి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒక వారధిగా ఉండాలి. కానీ, ప్రస్తుత రాజకీయ ముఖచిత్రంలో గవర్నర్ల తీరు 'వారధి' కన్నా 'అవరోధం'గానే ఎక్కువగా కనిపిస్తోంది. ముఖ్యంగా విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాజ్‌భవన్‌లు రాజకీయ వేదికలుగా మారుతున్నాయన్న విమర్శలు ప్రజాస్వామ్యవాదులను కలవరపెడుతున్నాయి.

**రాజ్యాంగం ప్రకారం గవర్నర్ నామమాత్రపు అధిపతి మాత్రమే. ఎన్నికైన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు ఆమోదముద్ర వేయడం, రాజ్యాంగ సంక్షోభం తలెత్తినప్పుడు సలహాదారుగా వ్యవహరించడం వారి ప్రధాన విధి.**





రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం, ప్రజా నిర్ణయాలను గౌరవించకుండా అడ్డుకోవడం వంటి చర్యలు సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయి. ఇది పరోక్షంగా ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాల చేతులు కట్టేయడమే అవుతుంది. గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ 'ఏజెంట్లు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కొత్తవి కావు. కానీ, ఇటీవలి కాలంలో అవి మరింత బహిరంగంగా మారుతున్నాయి. పరిపాలనలో జోక్యం చేసుకోవడం, ముఖ్యమంత్రులతో ప్రత్యక్ష ఘర్షణకు దిగడం, సమాంతర పాలన సాగించేందుకు ప్రయత్నించడం వంటివి రాజ్యాంగం కల్పించిన విచక్షణాధికారాలను దుర్వినియోగం చేయడమే. గవర్నర్ వ్యవస్థ కేవలం కేంద్రం పట్టును నిరూపించుకోవడానికి సాధనంగా మారితే, అది రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని కాలరాసినట్లే. గవర్నర్ పదవికి ఒక నిర్దిష్టమైన ప్రవర్తనా నియమావళి ఉండాలని సర్కారియా కమిషన్, పూంఛీ కమిషన్ వంటివి ఎప్పుడో సూచించాయి. క్రియాశీల రాజకీయాల్లో ఉన్నవారిని కాకుండా, తటస్థంగా ఉండే మేధావులను ఈ పదవిలో నియమించడం వల్ల కొంత మార్పు రావచ్చు. అలాగే, బిల్లుల ఆమోదంపై కాలపరిమితి విధించడం అత్యంత అవసరం. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానిదే అంతిమ నిర్ణయం కావాలి. గవర్నర్ వ్యవస్థ ఆ నిర్ణయాలను సరిదిద్దే మార్గదర్శిగా ఉండాలే తప్ప, అడ్డుకట్ట వేసే ఆనకట్టగా మారకూడదు. రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నవారు తమ వ్యక్తిగత, రాజకీయ విధేయతలను పక్కనపెట్టి, రాజ్యాంగ విలువలకే కట్టుబడాలి. అప్పుడే భారత ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.

తమిళనాడులో తలెత్తిన రాజకీయ సంక్షోభం నేపథ్యంలో మరోసారి గవర్నర్ల గిరీపై చర్చ జరుగుతోంది. తమిళనాడు రాజకీయాల్లో 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించాయి. దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం తన తొలి అడుగులోనే 108 స్థానాలను గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించడం ఒక అద్భుతం. అయితే, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాతీర్పు ఎంత కీలకమో, ఆ తీర్పును అమలు చేసే రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉండేవారి నిర్ణయాలు కూడా అంతకంటే ముఖ్యం. ప్రస్తుతం తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అవలంబిస్తున్న తీరు రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామ్య సంప్రదాయాలను ప్రశ్నించేలా ఉంది. హంగ్ అసెంబ్లీ ఏర్పడినప్పుడు, అతిపెద్ద పార్టీగా అవతరించిన పక్షాన్ని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడం భారత ప్రజాస్వామ్య చరిత్రలో స్థిరపడిన సంప్రదాయం. కానీ, టీవీకే 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా నిలిచినా, మ్యాజిక్ ఫిగర్ (118) లేదనే కారణంతో విజయ్‌ను ఆహ్వానించడానికి గవర్నర్ నిరాకరించడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ తన 5 మంది ఎమ్మెల్యేలతో మద్దతు ప్రకటించినప్పటికీ, సంతకాలతో కూడిన పూర్తి జాబితా ఉంటేనే ప్రమాణ స్వీకారానికి అనుమతిస్తామన్న పట్టుదల రాజ్‌భవన్ అధికారాన్ని అతిక్రమించడమే అవుతుంది. మెజారిటీ ఉందో లేదో తేలాల్సింది అసెంబ్లీ వేదికగా 'ఫ్లోర్ టెస్ట్' ద్వారానే తప్ప, రాజ్‌భవన్ గదుల్లో కాదని గతంలో సుప్రీంకోర్టు ఎన్నోసార్లు స్పష్టం చేసింది. గవర్నర్ కేవలం ప్రభుత్వ స్థిరత్వం పేరుతో అతిపెద్ద పార్టీకి అవకాశం ఇవ్వకుండా కాలయాపన చేయడం 'హార్స్ ట్రేడింగ్' (ఎమ్మెల్యేల కొనుగోలు)కి పరోక్షంగా దారితీస్తుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఒక కొత్త పార్టీకి ప్రజలు పట్టం కట్టినప్పుడు, దాన్ని గౌరవించి రాజ్యాంగ పద్ధతిలో అవకాశం ఇవ్వడం గవర్నర్ కనీస ధర్మం. గవర్నర్ వ్యవస్థ రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేదిగా ఉండాలి. టీవీకే విషయంలో గవర్నర్ చూపిస్తున్న కఠిన వైఖరి కేవలం 'రాజ్యాంగ రక్షణ' కోసమేనా లేక ఇతర రాజకీయ ఒత్తిళ్ల ఫలితమా? అన్న అనుమానం సగటు ఓటరులో కలగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. సంఖ్యాబలం నిరూపించుకోవడానికి గడువు ఇచ్చి, అతిపెద్ద పార్టీని ఆహ్వానించడమే ప్రస్తుత రాజకీయ అనిశ్చితికి ఏకైక పరిష్కారం. రాజ్యాంగ బద్ధమైన నిర్ణయాలు ప్రజా తీర్పుకు అద్దం పట్టాలే తప్ప, ఆ తీర్పును అడ్డుకునే గోడలుగా మారకూడదు.



- నవీన్ పోగుల,
బీఆర్ఎస్ పార్టీ
సీనియర్ నాయకుడు

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.